www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -62 మంగళవారం 16 జూన్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# యుద్ధం ముగిసింది



## ట్రూత్ సోషల్ మీడియాలో ప్రకటించిన ట్రంప్

## -ఒప్పందాన్ని స్వాగతించిన ప్రపంచ దేశాలు

## ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందం

**వాషింగ్టన్,జూన్ 15 (ప్రజావినికిడి);**
పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర పడింది. అమెరికా-ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. ఈ వారం చివర్లో దీనిపై సంతకాలు జరగనున్నాయి. మూడు నెలలకు పైగా సాగిన యుద్ధం ముగిసిపోవడంతో భారత్ సహా ప్రపంచదేశాలు హర్షం వ్యక్తంచేశాయి. ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. పశ్చిమాసియాలో సుస్థిర శాంతి నెలకొనాలని ఆకాంక్షించాయి. నెలల తరబడి ఉత్కంఠ రేపిన పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కుదిరిన చరిత్రాత్మక శాంతి ఒప్పందాన్ని ప్రపంచ దేశాలు ఏకగ్రీవంగా స్వాగతించాయి. ప్రాంతీయ స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి,



వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అంతర్జాతీయ ఆర్థిక రంగానికి ఊరటనిచ్చేందుకు
ఈ ఒప్పందం ఒక అద్భుతమైన దౌత్యపరమైన మలుపు అని ప్రపంచ దేశాల నేతలు అభివర్ణించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ఈ చారిత్రాత్మక ఒప్పందానికి పాకిస్థాన్ ప్రధానంగా మధ్యవర్తిత్వం వహించగా. **మిగతా 2లో...**

## స్వాగతిస్తూ మోడీ ప్రకటన

సానుకూల చర్చలు జరుగుతాయని విశ్వసిస్తున్నాం



జాతీయ సమైక్యత కోసం..



# దేశసమగ్రతను కాపాడుతాం

**దేశ సమగ్రత, శ్రేయస్సు లక్ష్యాంగా జనసేన ఆవిర్భావం**

**12 ఏళ్ల ప్రస్థానంలో అనేక పోరాటాలు..విజయాలు..పరాజయాలు**

**మార్పు కోసం ఎవరైనా ప్రయత్నించ వచ్చు**

**అందుకు కాక్రోచ్ జనతా పార్టీయే ఉదాహరణ**

**జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం సభలో పవన్ కళ్యాణ్**



**న్యూఢిల్లీ,జూన్ 15 (ప్రజావినికిడి);**
జనసేన ప్రారంభించినప్పుడు దేశ సమగ్రత, శ్రేయస్సు తప్ప.. తనకు ఏ ఆలోచనా లేదని ఆ పార్టీ అధ్యక్షుడు, డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. పార్టీ స్థాపించినప్పుడు అధికారం వస్తుందో, రాదో కూడా తెలియదన్నారు. 'జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం'**మిగతా 2లో...**



## యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ 2026 ఫలితాలు విడుదల

**మెయిన్స్ పరీక్షకు 13,343 మంది అభ్యర్థుల అర్హత**

**మొత్తం 1,016 పోస్టుల భర్తీకి కొనసాగుతున్న ప్రక్రియ**

**జూన్ 19 నుంచి 28 వరకు మెయిన్స్‌కు దరఖాస్తుల స్వీకరణ**

**న్యూఢిల్లీ,జూన్ 15 (ప్రజావినికిడి);**
యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్ష 2026 ఫలితాలను సోమవారం (జూన్ 15) విడుదల చేసింది. ఈ పరీక్షలో దేశవ్యాప్తంగా మొత్తం 13,343 మంది అభ్యర్థులు తదుపరి దశ అయిన మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించారు. అర్హత సాధించిన అభ్యర్థుల రోల్ నంబర్లతో కూడిన జాబితాను యూపీఎస్సీ తన అధికారిక వెబ్‌సైట్ upsc.gov.inలో అందుబాటులో ఉంచింది. **మిగతా 2లో...**

# క్షేత్రస్థాయిలో వెళ్లని అధికారులపై చర్యలు తప్పవు

**ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికతో ప్రజలకు చేరువయ్యాం**

**కొన్ని విభాగాలు ఇంకా ప్రజల్లోకి వెళ్లలేక పోయాయి**

**అన్ని శాఖలు చేపట్టిన కార్యక్రమాలకు ప్రచారం కల్పించాలి**

**గ్రామాల్లో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలి**

**మీడియా, డిజిటల్ మీడియా ద్వారా చేసిన పనులకు ప్రాచుర్యం**

**ప్రగతి ప్రణాళికపై సచివాలయంలో సిఎం రేవంత్ సమీక్ష**

**హైదరాబాద్,జూన్ 15 (ప్రజావినికిడి);**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో చేపట్టిన కార్యక్రమాలను కొన్ని విభాగాలు ఆశించినంతగా చెప్పుకోలేక పోయాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వెంటనే అన్ని శాఖలు తాము చేపట్టిన కార్యక్రమాలకు తగినంత ప్రచారం కల్పించాలని సూచించారు. సంబంధిత ఉన్నతాధికారులు ఆ బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. మీడియా, డిజిటల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు తాము చేసిన మంచి పనులు చెప్పుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ స్థాయిల్లో జరిగిన. **మిగతా 2లో...**





## డిమాండ్ ఉన్న వరి వంగడాలకే ప్రోత్సాహం

**తెలంగాణ వరి ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్**

**రైతులు వాటినే పండించేలా దిశా నిర్దేశం**

**మిల్లర్లు కొనుగోలు చేసే రకాలను పండిస్తే మేలు**

**ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు**

**కేబినేట్ సబ్‌కమిటీలో డిప్యూటి సిఎం భట్టి సూచనలు**



**హైదరాబాద్,జూన్ 15 (ప్రజావినికిడి);**
రాష్ట్రంలో 8 మేలురకం వరి వంగడాల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విదేశాల్లో తెలంగాణ బియ్యానికి బాగా డిమాండ్ ఉందని భట్టి విక్రమార్క ప్రస్తావించారు. మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికే అవకాశం**మిగతా 2లో...**

# సీఎంది అసమర్థ పాలన

**ప్రభుత్వ చేతకాని తనం వల్లే మెట్రో ఫేజ్2కు అనుమతి రాలేదు**

**ఎల్ అండ్ టీని బెదిరించటం ద్వారా మెట్రో రైల్ ఆస్తులు కొల్లగొట్టే కుట్ర**

**: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్‌జూన్ 15 (ప్రజావినికిడి);**
మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టును కేంద్రం నుంచి సాధించలేక, చాతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇన్ని కుప్పిగంతులు తొక్కుతున్నారనీ, అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో ఫేజ్-2కి అనుమతి దక్కకపోవడం రేవంత్ రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనమని విమర్శించారు. యూపీ, అహ్మదాబాద్, వైజాగ్ వంటి నగరాలకు కేంద్రం మెట్రోలను మంజూరు చేస్తుంటే, హైదరాబాద్‌కు ఎందుకు తీసుకురాలేకపోయారో ముందుగా ప్రజలకు జవాబు చెప్పాలని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన మెట్రో విస్తరణకు అనుమతి ఇవ్వని కేంద్రంపైన ముఖ్యంగా . **మిగతా 2లో...**



## మోడీ హామీల అమలుపై చెప్పండి... నేను రాజీనామాకు సిద్ధం

**మెట్రో విస్తరణకు మోకాలడ్డిన కిషన్ రెడ్డి**

**హైదరాబాద్ అభివృద్ధిని విస్మరించిన కేంద్రమంత్రి**

**కెసిఆర్ కనుసన్నల్లో పనిచేస్తున్న గంగాపురం**

**ఎన్‌వోసి ఇప్పించడంలో కూడా విఫలం**

**ఎల్ అండ్ టికి రుణ బదలాయింపును అడ్డుకున్న పెద్దమనిషి**

**అభివృద్ధి జరిగితే పుట్టగతులు ఉండవనే భయంలో బిజెపి**

**మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి లక్ష్యంగా సిఎం రేవంత్ విమర్శలు**

**హైదరాబాద్,జూన్ 15 (ప్రజావినికిడి);**
మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణ జరిగేచోట బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలే ఉన్నారని తెలిపారు. సమస్యలపై మాట్లాడదామంటే కేంద్రమంతి కిషన్‌రెడ్డి సమయం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. **మిగతా 2లో...**



## సర్ మొదటి విడతకు ఈసీ ఏర్పాట్లు

**జూన్ 25 నుంచి అక్టోబర్ 10 వరకు షెడ్యూల్ ఖరారు**

**ప్రతి ఇంటిని బీఎల్ఓ మూడుసార్లు సందర్శిస్తారు**

**ఓటర్ మ్యాపింగ్‌కు 2002 సర్**

**ప్రామాణికం కాదు: ఎన్నికల సంఘం మార్గదర్శకాలు**



# సర్ మొదటి విడతకు ఈసీ ఏర్పాట్లు

**హైదరాబాద్‌జూన్ 15 (ప్రజావినికిడి);**
రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) మొదటి విడత ప్రక్రియ మరో 10 రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో తెలంగాణ ఎన్నికల సంఘం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. జూన్ 25 నుంచి జులై 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటి సర్వే నిర్వహిస్తారు. జులై 1న ముసాయిదా ఓటర్ జాబితా ప్రచురణ, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అంభ్యంతరాల స్వీకరణ, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కారం అనంతరం అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఇందుకు సంబంధించి ఈఆర్‌ఓ, బీఎల్‌ఓలకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది. బీఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శించి రెండు ప్రతుల ఓటరు నమోదు ఫారాలను అందజేస్తారు. బీఎల్‌వో ఇంటిని సందర్శించినప్పుడు ఇల్లు తాళం వేసి ఉంటే, కనీసం మూడు సార్లు సందర్శిస్తారు. ఓటర్లు తమ నమోదు ఫారాలను ఆన్‌లైన్‌లో కూడా డౌన్లోడ్ చేసుకుని పూరించి సమర్పించవచ్చు. నిర్దిష్ట సమయంలో నమోదు ఫారం సమర్పించలేని ఓటర్లు, క్లెయిమ్ లు, అభ్యంతరాల కాలంలో నిర్దేశిత ప్రకటన ఫారంతో పాటు ఫారం–6 సమర్పించి పేరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలు సమర్పించని ఓటర్ల విషయంలో ఈఆర్‌వో, ఏఈఆర్‌వోలు విచారణ చేస్తారని అన్నారు. విచారణ సమయంలో అవసరమైన పత్రాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. అయినా జాబితాపై అభ్యంతరాలుంటే ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి (ఈఆర్‌వో) తీసుకున్న ఏ నిర్ణయంపైనైనా ప్రజాప్రాతినిధ్య చట్టం–1950 లోని సెక్షన్ 24(ఘ) ప్రకారం జిల్లా మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేయవచ్చన్నారు. మొదటి అప్పీల్ అధికారి నిర్ణయంపై 25 24(ఎ) ప్రకారం రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్షన్ రూల్స్ 1960లోని రూల్ 27 ప్రకారం ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో)కు రెండో అప్పీల్ చేయవచ్చు. అన్ని జిల్లాల్లో సర్ హెల్ప్ డెస్క్‌లను ఈసీ ఏర్పాటు చేసింది.

**విదేశాల్లో ఉంటే**
కుటుంబంలో అర్హత కలిగిన ఓటరు విదేశాల్లో ఉన్నా, దేశంలోని ఏ ఇతర నగరంలో ఉపాధి పొందుతున్నా సంబంధిత ఓటరు ఎన్యూమరేటర్ ఫారంను కుటుంబ యజమానికి అందజేస్తారు. అతను అందుబాటులో లేని ఓటరు వివరాలను పూరించి బీఎల్‌ఓకు అందజేస్తారు. ఓటరు తరపున డిక్లరేషన్ సమర్పిస్తారు. అందులో సమర్పించిన వివరాలు, ధృవీకరణ పత్రాలు సరైనవే అయితే సదరు వ్యక్తి ఓటును తుది జాబితాలో ప్రచురిస్తారు.

**2002 సర్ తప్పని సరికాదు**
ఓటర్లు తమ పేరు లేదా తమ తల్లిదండ్రులు, తాత లేదా అమ్మమ్మ పేర్లు 2002 ప్రత్యేక సమగ్ర సవరణ ఓటరు జాబితాలో ఉన్నట్లయితే వాటి వివరాల ఆధారంగా బీఎల్‌ఓ మ్యాపింగ్ చేస్తారు. వారు కూడా ఆ సమయంలో నమోదు చేసుకోకపోయినా, తల్లిదండ్రులు లేని వారయినా అది తప్పని సరి కాదు. అలాంటి వారు తమ స్థానికతను రుజువు చేసుకునేందుకు ఆధార్ కార్డు మినహా 11 గుర్తింపు కార్డులు చెల్లుబాటు అవుతాయని ఎన్నికల సంఘం వెల్లడించింది. అందులో ఏదైనా ఒక కార్డును బీఎల్‌వోకు సమర్పించాలి.

**గుర్తింపు కార్డులు**
1)కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షన్ కార్డులు
2). 1987 జులై 1 కి ముందు ప్రభుత్వ, స్థానిక అధికారులు, బ్యాంకులు, పోస్టాఫీసులు, ఎల్ఐసీల ద్వారా జారీ చేయబడిన గుర్తింపు కార్డు
3). సమర్థ అధికార సంస్థ జారీ చేసిన్ జన్మ ధృవీకరణ పత్రం
4). పాస్ పోర్ట్ ,గుర్తింపు పొందిన బోర్డులు, విశ్వవిద్యాలయాలు జారీ చేసిన టెన్త్ సర్టిఫికెట్
6). సమర్థ అధికార సంస్థ జారీ చేసిన శాశ్వత నివాస ధృవీకరణ పత్రం
7). అటవీ హక్కుల ధృవీకరణ పత్రం
8). సమర్థ అధికార సంస్థ జారీ చేసిన ఎస్సీ, ఎస్టీ కుల ధృవీకరణ పత్రం

# యుద్ధం ముగిసింది

**. మొదటిపేజీ తరువాయి**
ఖతార్, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు దీనిపై హర్షం వ్యక్తం చేశాయి. ఈ ఒప్పందం పూర్తయినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా అధికారికంగా ప్రకటించారు.
'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! ప్రపంచ నౌకలారా, మీ ఇంజన్లు స్టార్ట్ చేయండి. ఆయిల్ ప్రవహించనివ్వండి!' అని ట్రంప్ ఉత్సాహంగా ట్వీట్ చేశారు. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. ఈ
డీల్‌తో హర్మూజ్ జలసంధిలో ఇకపై నౌకల రవాణా నిరాటంకంగా, స్వేచ్ఛగా జరుగుతుందని ఆశిస్తున్నాం. శాంతి, ప్రాంతీయ స్థిరత్వం కోసం చేపట్టే అన్ని చర్యలకు భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుంది. ఈ పరిణామాలను స్ఫూర్తిగా తీసుకుని ఉక్రెయిన్–రష్యా కూడా శాంతి ప్రయత్నాలు చేయాలని ఆకాంక్షిస్తున్నాం అని మంత్రిత్వ శాఖల అంతర్గత సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్‌వాల్ వెల్లడించారు. అమెరికా–ఇరాన్ మధ్య దౌత్యపరంగా చారిత్రక డీల్ జరగడం అభినందనీయం. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థికవ్యవస్థ పునరుజ్జీవనానికి మార్గం సుగమం చేశాయి. పశ్చిమాసియా మరింత సురక్షితంగా ఉంటుంది. ఈ ఒప్పందాన్ని కృతనిశ్చయంతో అమలుచేయడం అత్యావశ్యకం అని జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ అభిప్రాయపడ్డారు. ఇరాన్–అమెరికా డీల్ శుభపరిణామం. ఈ ఒప్పందాన్ని వీలైనంత వేగంగా అమల్లోకి తీసుకురావాలి. హర్మూజ్ జలసంధిని త్వరగా, భేషరతుగా తెరవాలి. ఎలాంటి ఆంక్షలు, టోల్స్ లేకుండా నౌకల రవాణాను పునరుద్ధరించాలి. అప్పుడే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలం. ఇరాన్ అణు, బాలిస్టిక్ క్షిపణులకు సంబంధించిన ఆందోళనలను కూడా ఈ డీల్ పరిష్కరించాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ అన్నారు. ఇరాన్–అమెరికా ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు డీల్ కోసం మధ్యవర్తిత్వం చేసిన దేశాలకు అభినందనలు. ఇప్పుడు అందరి దృష్టి ఈ ఒప్పందం అమలుపైనే ఉంది. హర్మూజ్‌ను శాశ్వతంగా తెరవడంతో పాటు నౌకల భద్రతకు సంబంధించిన సాంకేతిక అంశాల్లో మద్దతిచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. సుస్థిరశాంతికే మా ప్రథమ ప్రాధాన్యం. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండొద్దన్న మా వైఖరి ఇప్పటికీ స్థిరంగా ఉందని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు. ఈ ఒప్పందాన్ని యావత్ ప్రపంచం కోరుకుంది. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వానికి మార్గం సుగమం చేస్తాయని ఆశిస్తున్నా. మరికొన్ని రోజుల్లో ఈ ఒప్పందంపై సంతకాలు జరగనున్న వేళ.. ప్రస్తుతానికి ఇరుపక్షాలు రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని కోరుతున్నా. దీనికి మధ్యవర్తిత్వం వహించిన దేశాలకు అభినందనలు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా దౌత్య పరిష్కారాలకు మేం నిరంతరం మద్దతు ఇస్తాం తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ అభిప్రాయపడ్డారు.

## స్వాగతిస్తూ మోడీ ప్రకటన

అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంపై భారత ప్రధాని నరేంద్రమోదీ స్వాగతించారు. ఉద్రిక్తతలను ముగించేందుకు ఇరుదేశాలు ఓ అంగీకారానికి రావడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో మోదీ పోస్ట్ చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడింది. ఎన్నో దేశాల్లో ప్రాణనష్టం వాటిల్లింది. ఈ యుద్ధాన్ని ముగించేలా అమెరికా, ఇరాన్ అంగీకారం కుదుర్చుకోవడం స్వాగతించే విషయం. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాలను పునరుద్ధరించడం, స్వేచ్ఛా నౌకాయానం, వాణిజ్యానికి భరోసా కల్పించడంలో ఈ పరిణామం సాయపడుతుందని భారత్ విశ్వసిస్తోంది. సుస్థిరమైన తుది ఒప్పందానికి దారితీసేలా.. మిగిలిన అంశాల పైనా సానుకూల చర్చలు జరుగుతాయని విశ్వసిస్తున్నాం అని మోదీ రాసుకొచ్చారు. పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేలా ఇరాన్‌తో ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీన్ని టెహ్రాన్ కూడా ధ్రువీకరించింది. దీనిపై స్విట్జర్లాండ్ వేదికగా జూన్ 19న ఇరుదేశాలు సంతకాలు చేయనున్నాయి. హర్మూజ్‌లో అమెరికా నౌకాదళ దిగ్బంధాన్ని తొలగించడం, ఈ జలసంధిని పూర్తిగా తెరవడం, ఇరాన్ చమురుపై ఆంక్షలు తదితర అంశాలపై ఇరుదేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలిసింది.

# మోడీ హామీల అమలుపై చెప్పండి...నేను రాజీనామాకు సిద్ధం

**మొదటిపేజీ తరువాయి**
సోమవారం సచివాలయంలో సిఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకుని మాట్లాడాలని సూచించారు. మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా? లేదా? అని ప్రశ్నించారు. లోన్ బదిలీ కాకుండా కిషన్‌రెడ్డి వల్లే మెట్రో విస్తరణ ఆగిందని ఆరోపించారు. మెట్రో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలని సూచించారు. అంతా తామే భరిస్తామని.. ఎన్‌వోసి ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం లేకుండా మెట్రోను తాము విస్తరిస్తామని కేంద్ర పెద్దలతో తాము చెప్పామని పేర్కొన్నారు. రాజకీయంగా నష్టం జరుగుతోందని మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రుణం ఇవ్వకపోతే కనీసం ఎన్‌వోసి అయినా ఇప్పించరా? అని నిలదీశారు. నిధులు ఇప్పించి ఎన్‌వోసి ఇస్తే శాలువా కప్పి ఆయనను సన్మానిస్తామని తెలిపారు. కిషన్‌రెడ్డిని కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు లొంగిపోయి కిషన్‌రెడ్డే అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఆయన వెనుక కేటీఆర్ ఉన్నారని ఆరోపించారు. కేటీఆర్ కుట్రలకు కేంద్రమంత్రి సహకరిస్తున్నారని ఆక్షేపించారు.కేటీఆర్ కుట్రలు చేస్తుంటే.. కిషన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కిషన్‌రెడ్డికి అంత తెలివిలేదని.. కేటీఆర్ చెప్పిందే చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మెట్రోలో ప్రయాణించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచిస్తున్నారని తెలిపారు. ప్రధాని సూచనలను తాము అమలు చేయాలని చూస్తుంటే.. ఆయన ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఫేజ్–1ను కేంద్రం స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఫేజ్–2 నిర్మించుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. అహ్మదాబాద్ మెట్రోకు అనుమతులు, నిధులు వచ్చాయని ప్రస్తావించారు. హైదరాబాద్‌కు మాత్రం అనుమతులు, నిధులు ఎందుకు రావట్లేదని ప్రశ్నించారు. విశాఖపట్నం మెట్రో నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చారని తెలిపారు. తెలంగాణపై కేంద్రానికి ఎంత వివక్ష ఉందో ఈ విషయంలో అర్థమవుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. మొదటి దశలో రూ.15 వేల కోట్లతో పూర్తి కావాల్సిన మెట్రో రైలు నిర్మాణ వ్యయం రూ.22 వేల కోట్లకు పెరిగిందన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలు ప్రయాణించాల్సిన ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరగలేదని విమర్శించారు.

# దేశసమగ్రతను కాపాడుతాం

**మొదటిపేజీ తరువాయి**
పేరిట దిల్లీలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. పార్టీ స్థాపించి 12 ఏళ్లు పూర్తయిందని, ఈ ప్రయాణంలో చాలా పోరాటాలు చేశామని, పరాజయాలు ఎదుర్కొన్నామని చెప్పారు.మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా 7 ప్రాథమిక సూత్రాలను వదల్లేదు. నిర్దిష్ట ఆచరణాత్మక విధానంతో 21 ఎమ్మెల్యే స్థానాలు, 3 ఎంపీ స్థానాలను సాధించాం. లక్ష మంది సభ్యత్వంతో ప్రారంభమైన పార్టీకి.. 20 లక్షలకుపైగా సభ్యత్వాలు వచ్చాయి. ఇటీవల కాలంలో అన్ని ప్రాంతాల నుంచి వేల మంది పార్టీలో చేరుతున్నారు. పార్టీ ప్రయోజనాల కంటే.. దేశ సమగ్రతకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం. దేశ స్ఫూర్తిని కాపాడుకోవడం ఒక రోజుతో అయ్యే పని కాదు. దేశ స్ఫూర్తిని ప్రతితరం ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ఏనాడూ జనసేన అడ్డు చెప్పలేదని పవన్ మరోమారు స్పష్టం చేశారు. 2014లో ఏపీని విభజించిన తీరును చూసి మాత్రమే ఆవేదన వ్యక్తం చేశాం. విభజన విషయంలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరు.. అసంతృప్తిని, అశాంతిని సృష్టించింది. అప్పటి నుంచి ఇప్పటికీ వారి ధోరణి మారలేదు. జనసేన సభకు అనుమతివ్వకుండా అడ్డుకోవడమే అందుకు ఉదాహరణ. దిల్లీ మెడలు వంచుతాం.. తడాఖా చూపిస్తామంటూ చాలామంది పెద్దలు మాటలు చెబుతారు. వాస్తవానికి అలాంటి నేతలు దిల్లీకి రాగానే వెనక్కి తగ్గుతారు. చాలాసార్లు మనకు మనం తక్కువగా అంచనా వేసుకుంటాం. ప్రతి వ్యక్తి కూడా సమాజంలో మార్పు తీసుకురావొచ్చు. ఈ మధ్య కాక్రోచ్ పార్టీ ఎలా పుట్టుకొచ్చిందో చూస్తున్నాం. కాక్రోచ్ పార్టీని చూస్తే.. చలిచీమల పద్యం గుర్తుకొచ్చింది. చలిచీమలు కూడా బలమైన పామును చంపేస్తాయని పవన్ అన్నారు. ఈ సమావేశంలో మొత్తం ఐదు కీలక తీర్మానాలని ఆమోదించారు.మొత్తం ఐదు తీర్మానాల ద్వారా జనసేన పార్టీ తన రాజకీయ సిద్ధాంతాలను, అభివృద్ధి దృక్పథాన్ని, దేశ సమైక్యతపై నిబద్ధతను మరింత స్పష్టంగా ప్రకటించినట్లు సమావేశంలో నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశం పార్టీ భవిష్యత్తు కార్యాచరణకు దిశానిర్దేశర చేస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. జాతీయవాదం, దేశ సమైక్యత, వికసిత్ భారత్ లక్ష్యాలు, ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం, యువత ఆకాంక్షలు వంటి కీలక అంశాలపై విస్తృత చర్చలకు వేదికగా నిలిచింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి వచ్చిన పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి, సుపరిపాలన, జాతీయ భద్రత రంగాల్లో సాధించిన పురోగతిని ప్రస్తావించారు. గత 12 ఏళ్ల పాలన ప్రతి భారతీయుడిలో భరోసా, విశ్వాసాన్ని పెంపొందించిందని అభిప్రాయపడ్డారు. వికసిత్ భారత్–2047 లక్ష్యంతో దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడారు.




**అమర స్థూపం వద్ద వీర జవాన్లకు ఘన నివాళి**
భారత సైనికుల త్యాగం, ధైర్యం, దేశభక్తికి చిరస్మరణీయ ప్రతీకగా నిలిచే ఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్ ను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ సందర్శించారు. అమరస్థూపం వద్ద వీర జవాన్లకు పుష్పగుచ్ఛం సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ వందనం సమర్పించారు. కల్నల్ ఆర్.కె. ఆనంద్ , కెప్టెన్ రోహిత్ గార్గ్ నేతృత్వంలో ఈ వందన సమర్పణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు దేశ భద్రత కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల జీవితాలను సైనికాధికారులను వివరిస్తుంటే శ్రద్ధగా ఆలకించారు. సైనికుల ప్రాణత్యాగాల తాలూకు ఔన్నత్యాన్ని తెలుసుకునే అవకాశం దక్కడం, వారికి నివాళులు అర్పించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపారు

## యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ 2026 ఫలితాలు విడుదల

**మొదటిపేజీ తరువాయి**
.ఈ ఏడాది మే 24న దేశవ్యాప్తంగా సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించారు. మొత్తం 1,016 సివిల్ సర్వీసెస్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయగా, మెయిన్స్‌కు ఎంపికైన వారి జాబితాను నేడు ప్రకటించారు. గతేడాది 1,087 ఖాళీలకు 14,161 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు అర్హత సాధించిన విషయం తెలిసిందే.మెయిన్స్‌కు అర్హత పొందిన అభ్యర్థులు తప్పనిసరిగా జూన్ 19 నుంచి జూన్ 28, 2026 మధ్య యూపీఎస్సీ పోర్టల్‌లో లాగిన్ అయి డిటైల్డ్ అప్లికేషన్ ఫామ్ నింపాల్సి ఉంటుంది. ఈ సమయంలోనే రూ.200 పరీక్ష ఫీజును చెల్లించాలి. అయితే, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు నుంచి మినహాయింపు కల్పించారు.అభ్యర్థులు సాధించిన మార్కులు, కటాఫ్ మార్కులు, ఆన్సర్ కీలను సివిల్ సర్వీసెస్ 2026 తుది ఫలితాలు వెలువడిన తర్వాతే ప్రకటిస్తామని యూపీఎస్సీ స్పష్టం చేసింది. ఏవైనా సందేహాలుంటే యూపీఎస్సీ కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని సూచించింది.

## డిమాండ్ ఉన్న వరి వంగడాలకే ప్రోత్సాహం

**మొదటిపేజీ తరువాయి**
ఉందని వెల్లడించారు. తెలంగాణ సోనామసూరి సహా ఎగుమతులకు అనుకూలమైన వరి రకాలపై రైతన్నలు దృష్టిపెట్టాలని సూచించారు. ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సోమవారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఎగుమతి రకాల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కేబినెట్ సబ్ కమిటీకి వ్యవసాయ నిపుణుల కీలక సూచనలు చేశారని తెలిపారు. ఆ 8 రకాల వంగడాలతోనే రైతులకు లాభాలు వస్తాయని వివరించారు. మార్కెట్ డిమాండ్ ఉన్న వరి రకాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆదరణ ఉన్న బియ్యం ఉత్పత్తిని పెంచాలని సూచించారు. రైతుల ఆదాయం పెంచే పంటల సాగును ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గ్రామస్థాయిలో రైతులకు చైతన్య సదస్సులు నిర్వహించాలని సూచించారు. రైతులకు మార్కెట్ ఆధారిత పంటల సాగుపై మార్గనిర్దేశర చేయాలని నిర్ణయించామని అన్నారు. డిమాండ్ లేని వరి రకాల సాగును క్రమంగా తగ్గించాలని చెప్పారు. వినియోగదారులు, మిల్లర్లు కోరుకునే వరి రకాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎగుమతులకు అనుకూలమైన నిర్దిష్ట వరి రకాల సాగు విస్తరణపై దృష్టి పెట్టాలని భట్టి విక్రమార్క మార్గనిర్దేశం చేశారు. వానాకాలం సాగుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు పక్రియను కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. రైతులకు నష్టాలు రాకుండా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల ప్రణాళిక చేపట్టాలని సూచించారు. నాణ్యమైన బియ్యం ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాలని నిర్ణయించామని చెప్పారు. రైతులకు లాభదాయకమైన, ఎగుమతి అవకాశాలు ఉన్న వంగడాలపై ప్రత్యేక ప్రోత్సాహకాలని పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు, నిల్వ సదుపాయాలపై నిరంతర సమీక్షా సమావేశాలు కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. తెలంగాణను అధిక విలువ కలిగిన వరి ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపట్టాలని నిర్దేశిరచారు. రైతు ఆదాయం పెంపు, మార్కెట్ అనుసంధానానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించామని అన్నారు. రైతులకు మెరుగైన ధరలు వచ్చేలా మార్కెట్ డిమాండ్ ఆధారిత వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు

## క్షేత్రస్థాయిలో వెళ్లని అధికారులపై చర్యలు తప్పవు

**మొదటిపేజీ తరువాయి**
కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ను నమోదు చేయాలని, గ్రామాల్లో వచ్చిన సమస్యలను కూడా ఆయా శాఖలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, చేసిన శంకుస్థాపనలు, ఆస్తుల వివరాలన్నీ నమోదు చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 16 నుంచి జూన్ 12 వరకు చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. 9 రోజుల పాటు రాష్ట్రమంతటా జరిగిన కార్యక్రమాలపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, వాటి ద్వారా వచ్చిన ఫలితాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా అన్ని విభాగాలు తాము జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు చేపట్టిన కార్యక్రమాల వివరాల నివేదికలను సమర్పించాయి. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో చురుగ్గా పాల్గొన్న విభాగాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ప్రధాన కార్యదర్శుల నుంచి జిల్లా కలెక్టర్ వరకు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతినెలా క్షేత్రస్థాయికి వెళ్లాలని గతంలోనే ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లని అధికారులు, జిల్లా కలెక్టర్లపై తనకు నివేదిక ఇవ్వాలని చీఫ్ సెక్రటరీని సీఎం ఆదేశించారు. వారిపై క్రమశిక్షణా ఉల్లంఘన చర్యలు ఎందుకు తీసుకోకూడదో.. వెంటనే వివరణ కోరాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని అధికారులను ఉపేక్షించవద్దని హెచ్చరించారు. ఇప్పటికీ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలుంటే.. వెంటనే ఆ జాబితాను సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను సీఎం ఆదేశించారు. అక్కడ కొత్తగా గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను కూడా చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యా, వైద్య విభాగాల్లో అన్ని స్థాయిల్లో ఫేషియల్ రికగ్నిషన్ విధానం అమలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి కాలేజీల వరకు, పీహెచ్ సీ నుంచి ఉస్మానియా, గాంధీ ఆసుపత్రి వరకు ఉద్యోగులందరికీ ఇదే అటెండన్స్ విధానం పాటించాలన్నారు. రాష్ట్రస్థాయిలో 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించినట్లే.. జిల్లాల వారీగా వెంటనే ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై వెంటనే సమీక్ష జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షలకు రాష్ట్ర స్థాయి నుంచి ప్రతి జిల్లాకో సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్ గా నియమించి, ఆ జిల్లాకు పంపించాలని చెప్పారు. స్పెషలాఫీసర్ ఆ జిల్లా కలెక్టర్ కలిసి అన్ని విభాగాల్లో 99 రోజుల పాటు జరిగిన ప్రత్యేక కార్యక్రమాలు, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, వివిధ పథకాలపై వచ్చిన స్పందనలన్నింటినీ సమీక్షించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఈ ప్రగతి నివేదికలను విడుదల చేయాలని చెప్పారు. జిల్లాలతో పాటు నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుకున్న లబ్ధిదారులు, ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వీటిని డ్యాష్ బోర్డులో అందుబాటులో ఉంచాలని చెప్పారు. తాను ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత జిల్లాల పర్యటనలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సీఎం అధికారులను ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి హామీల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ప్లానింగ్ విభాగాన్ని ఆదేశించారు.ాజ్యసభ ఎంపీ వేంనరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## సీఎంది అసమర్ధ పాలన

**మొదటిపేజీ తరువాయి**
ప్రధాని నరేంద్రమోడీని విమర్శించే ధైర్యం రేవంత్ రెడ్డికి లేదని తెలిపారు. ఆయనపై నమోదైన ఓటుకు నోటు కేసు ఉచ్చు బిగుస్తుందనే భయంతో బీజేపీతో చీకటి ఒప్పందాలు చేసుకోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. అందుకే ప్రధాని మోడీని కాకుండా రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌ను విమర్శించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.
బీజేపీతో రేవంత్ రెడ్డికి ఉన్న లోపాయికారి ఒప్పందం వల్లే ఎన్నిసార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా కేంద్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ అంశంలో రేవంత్ రెడ్డి తన చాతగానితనానికి బాధ్యత వహిస్తూ హైదరాబాద్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమర్థవంతమైన నాయకుడు ఉంటే గతంలో కేసీఆర్ పాలనలో అనుమతులు, రుణాలు శరవేగంగా ఎలా వచ్చాయో, కాంగ్రెస్ పాలనలో అవి ఎందుకు ఆగిపోయాయో ప్రజలకు అర్థమవుతోందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రధాని మోడీని ప్రశ్నించలేని అసమర్థుడు సీఎం రేవంత్ రెడ్డి అని విమర్శించారు. మెట్రో రెండో దశను సాధించడంలో అట్టర్ ఫ్లాప్ అయినందుకు, మొదటి దశను ఆగం చేస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మెట్రో రైల్ పూర్తి చేసిన ఘనత ముమ్మాటికీ కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. 28 శాతం మెట్రో పనులు కూడా పూర్తి చేయకుండా ప్రాజెక్టును నాటి కాంగ్రెస్ ప్రభుత్వం చిక్కుల్లో వదిలేసిందని గుర్తు చేశారు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే కేసీఆర్ చొరవ తీసుకుని 72 శాతం పనులను పూర్తి చేశారని వివరించారు. కేవలం సీఎం స్వార్థ ప్రయోజనాలకోసం ఉనికిలో లేని ఊహా నగరానికి మెట్రో రెండో దశను రేవంత్ రెడ్డి ప్రతిపాదించారని తెలిపారు.కానీ గత ప్రభుత్వం ట్రాఫిక్ రద్దీ, నగర విస్తరణ, ప్రజల రోజు వారి అవసరాల కోసం మెట్రో రెండో దశను ప్రతిపాదించిందని పేర్కొన్నారు. రెండున్నరేండ్లలో మెట్రో ఫేజ్–2ను అటకెక్కించడం ప్రభుత్వ వైఫల్యమనీ, కాంగ్రెస్ అధికారం లోకి రాగానే శంషాబాద్ మెట్రోను రద్దు చేసి ద్రోహం చేసిందని తెలిపారు. మెట్రో ఫేజ్–2కు ఎల్ అండ్ టీ సంస్థ అంగీకరించలేదని ఎందుకు బుకాయి స్తున్నారని ప్రశ్నించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
మంగళవారం 16 జూన్ 2026

# కొందుర్గు అభివృద్ధి పథం...

## రాబోయే రోజుల్లో మరో కోకాపేట ఖాయం



**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**అసాధ్యమన్న లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును సుసాధ్యం చేశాం: ఎమ్మెల్యే**

**-గంగన్నగూడ వద్ద రూ.1.20 కోట్లతో నిర్మించిన హై లెవెల్ బ్రిడ్జ్ ప్రారంభం**

**- హర్షం వ్యక్తం చేసిన సర్పంచ్ విక్రమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు**






**షాద్ నగర్,(ప్రజావినికిడి);** నియోజకవర్గంలోని ఉమ్మడి కొందుర్గు మండలం సర్వతోముఖాభివృద్ధి దిశగా దూసుకుపోతోందని,కొంత మంది పాలకులు అసాధ్యమన్న లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును తాము సుసాధ్యం చేసి చూపించామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు.రాబోయే కాలంలో కొందుర్గు ప్రాంతం మరో 'కోకాపేట'గా మారడం ఖాయమని ఆయన అభివర్ణించారు. సోమవారం కొందుర్గు మండలం గంగన్నగూడ వద్ద హెచ్‌ఎండీఏ నిధులు రూ.1.20 కోట్లతో నూతనంగా నిర్మించిన హై లెవెల్ బ్రిడ్జ్‌ను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై,ప్రత్యేక పూజలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియాతో మాట్లాడుతూ, ప్రజల ముఖాల్లో సంతోషం చూడడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.సుమారు 20 నుండి 30 గ్రామాలకు ప్రధాన వారధిగా ఉండే ఈ హై లెవెల్ బ్రిడ్జ్ పనులను కేవలం నాలుగు నెలల రికార్డు సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రతి వర్షాకాలంలో రైతులు, విద్యార్థులు,ప్రయాణికులు ఎదుర్కొన్న తీవ్ర అవస్థలకు నేటితో తెరపడిందని హర్షం వ్యక్తం చేశారు.ఎలాంటి భారీ వరదలు వచ్చినా తట్టుకునేలా,భూమికి ఆరు మీటర్ల ఎత్తులో ఈ బ్రిడ్జ్‌ను నిర్మించినట్లు తెలిపారు.

**సీఎం రేవంత్ రెడ్డి సహకారంతోనే నిధులు**

ఈ ప్రాంత అభివృద్ధి కోసం తాను అసెంబ్లీలో గళమెత్తానని, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాలు,హెచ్‌ఎండీఏ కమిషనర్ సహకారంతో నియోజకవర్గానికి సుమారు 20 హై లెవెల్ బ్రిడ్జిలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వివరించారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం అన్ని బ్రిడ్జిల పనులు ముగింపు దశకు చేరుకున్నాయన్నారు.కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు రాకపోయినా బాధ్యతగా పనిచేశారని ఆయన అభినందించారు.ప్రస్తుతం రావిరాల,తంగళ్ళపల్లి,టేకులపల్లి తదితర బ్రిడ్జ్ పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. త్వరలోనే ఈ ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల కూడా పూర్తి కాబోతుందన్నారు. అభివృద్ధికి సహకరించిన అధికారులు,స్థానిక నాయకులు,రైతులు,గ్రామస్తులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**అసాధ్యం అన్నారు.. సుసాధ్యం చేశాం.. ప్రతిపక్షాలపై ఫైర్:**

లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు విషయంలో గతంలో కొందరు అవాకులు చెవాకులు పేల్చారని,ప్రాజెక్టు అసాధ్యమని ఎద్దేవా చేసిన వారే..నేడు తమ రాజకీయ ఉనికి కోసం అదే ప్రాజెక్టును సందర్శిస్తూ సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు.ఒక మహిళా ఎంపీ మాట్లాడుతూ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు విషయంలో మీ ఎమ్మెల్యే ఒక పిచ్చోడు అన్నట్లుగా వ్యవహరించారని,అలాంటి వారు నేడు రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతుండటాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన ఏద్దేవా చేశారు. ఎవరు పనిచేస్తున్నారో, ఎవరు డ్రామాలు ఆడుతున్నారో ప్రజలకు అన్నీ తెలుసని చురకలంటించారు.మరోవైపు పగటి వేషగాడిలా ఒకరు వస్తుంటారని, ఒకటి రెండు హైమాస్ట్ లైట్లు వేసి గ్రామాల్లో తిరుగుతూ కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు.బీఆర్ఎస్ పార్టీ గడిచిన 12 ఏళ్ల పాలనలో ఏం చేశాయో..తన హయాంలో గడిచిన రెండున్నరేళ్లు,రాబోయే రెండున్నరేళ్లలో జరిగే అభివృద్ధి ఏమిటో ప్రజల ముందు ఉంచుతామన్నారు.ఎవరు ఎన్ని కుట్రలు చేసినా తాను ప్రజల పక్షానే నిలబడతానని,
ఇచ్చిన మాట నిలబెట్టుకునే అలవాటు తనకు ఉందన్నారు.రాబోయే రోజుల్లో షాద్‌నగర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ధీమా వ్యక్తం చేశారు.అనంతరం స్థానిక సర్పంచి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ...గంగన్నగూడ హై లెవల్ బ్రిజ్ పనులు శరవేగంగా పూర్తయి ప్రజలకు అందుబాటులోకి రావడం చాలా సంతోషంగా ఉందని,ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే శంకర్ కు, అధికారులకు,కాంట్రాక్టర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు.బ్రిడ్జి లేక గతంలో విద్యార్థులు,రైతులు, ప్రయాణికులు ఎన్నో అవస్థలు పడ్డారని,ప్రజల అవసరాలను ఎమ్మెల్యేకు వివరించడంతో వెంటనే స్పందించి బ్రిడ్జి పనులను పూర్తి చేయించడం మా అదృష్టమన్నారు.గ్రామంలో నెలకొన్న సమస్యలను సైతం గడిచిన రెండున్నర ఏళ్లలో ఎమ్మెల్యే చాలా తీర్చారు అని ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు తమ గ్రామం ఎల్లవేళలా రుణపడి ఉంటుందని ఆయన తెలిపారు. అదేవిధంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు దామోదర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి తదితరులు ఎమ్మెల్యే పనితీరును ప్రజలకు అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు సయ్యద్ సాదిక్,జితేందర్ రెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు,ప్రజా ప్రతినిధులు,గంగన్నగూడ గ్రామ ప్రజలు భారీగా పాల్గొన్నారు.

## డెప్యుటేషన్‌పై ఒత్తిడి తెచ్చి న్యాయం చేయాలి



**నాంపల్లి,(ప్రజా వినికిడి):**డెప్యుటేషన్‌పై హైదరాబాద్‌కు తీసుకువచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి న్యాయం చేయాలని కేంద్ర సంఘం నాయకత్వాన్ని ఉద్యోగులు కోరారు.తెలంగాణ నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్ హైదరాబాద్ జిల్లా యూనియన్ అధ్యక్షులు ఎస్. విక్రమ్ కుమార్, కార్యదర్శి కురాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం రోజు జిల్లా సంఘం ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ ఆసుపత్రులు, శాఖల యూనియన్ నాయకులు కలిసి టీఎన్‌జీఓ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎమ్.హుస్సేని (ముజీబ్) లను కలిశారు.ప్రస్తుతం జరుగుతున్న బదిలీలలో హైదరాబాద్ జిల్లాలోని టీఎన్‌జీఓస్ యూనియన్ కార్యవర్గ సభ్యులు ఎక్కడికక్కడ తమ ప్రస్తుత పని ప్రదేశాలలోనే కొనసాగేలా కేంద్ర సంఘం చేసిన అసాధారణ కృషికి గాను ఈ సందర్భంగా వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సమావేశంలో టీఎన్‌జీఓ కేంద్ర సంఘం కార్యవర్గ సభ్యులు ఉమ (కోశాధికారి), కొండల్ రెడ్డి (ఉపాధ్యక్షులు), నరసింహారెడ్డి (ఉపాధ్యక్షులు), శైలజ (సంయుక్త కార్యదర్శి) పాల్గొన్నారు. అలాగే జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్.రాజ్ కుమార్,ఈసీ మెంబర్ ముఖీమ్ ఖురేషి తో పాటు ఖైరతాబాద్, అమీర్‌పేట్,కింగ్ కోఠి,జగమ్మేట్, నాంపల్లి, గోల్కొండ ఆసుపత్రుల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు,వర్క్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్, పెన్షన్ పేమెంట్, ట్రెజరీస్ డిపార్ట్‌మెంట్, నిలోఫర్ ఆసుపత్రి, గాంధీ ఆసుపత్రి, ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ మహిళా శిశు సంక్షేమ శాఖలకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు ఈసీ సభ్యులు హాజరయ్యారు. అనంతరం హైదరాబాద్ జిల్లా పరిధిలోని వైద్య ఆరోగ్య శాఖ, కార్మిక ఉపాధి శిక్షణ శాఖలలో నిబంధనలకు విరుద్ధంగా, మానవతా దృక్పథం లేకుండా జిల్లా దాటించి బదిలీ చేసిన పలువురు ఉద్యోగుల సమస్యలను విక్రమ్ కుమార్ కేంద్ర సంఘం నేతలకు వివరించారు. ముఖ్యంగా తీవ్రమైన అనారోగ్య సమస్యలతో (పోస్ట్-న్యూరోసర్జరీ,ఫిట్స్) బాధపడుతున్న అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్లు సెక్టార్ పరిధి దాటకుండా చూడాలని,అలాగే భర్త హైదరాబాద్‌లో పనిచేస్తూ భార్యను అన్యాయంగా సంగారెడ్డికి బదిలీ చేసిన ఫార్మాసిస్ట్ గ్రేడ్-2 లాంటి వారిని తిరిగి డెప్యుటేషన్‌పై హైదరాబాద్‌కు తీసుకువచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి న్యాయం చేయాలని కేంద్ర సంఘం నాయకత్వాన్ని కోరారు.దీనిపై టీఎన్‌జీఓ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్ సానుకూలంగా స్పందిస్తూ..ఈ సమస్యలను వెంటనే సదరు శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు డైరెక్టర్ల దృష్టికి తీసుకెళ్లి, ఉద్యోగులందరికీ త్వరలోనే న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనకు కుట్టుశిక్షణ కార్యక్రమాలు దోహదం చేస్తాయి: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..





**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
లింగోజిగూడా డివిజన్ పరిధిలోని మైత్రి నగర్‌లో గతంలో కుట్టుశిక్షణ పొందిన మహిళల సమావేశం ఘనంగా నిర్వహించబడిందిఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా మహిళలకు ఉచితంగా కుట్టుశిక్షణ అందించేందుకు ముందుకు వచ్చిన బండి ప్రభావతి కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఒక గొప్ప అవకాశమని,దీని ద్వారా ప్రతి మహిళ స్వయం ఉపాధి పొందడంతో పాటు ఎక్కడైనా ఉపాధి అవకాశాలను సృష్టించుకోగలదని పేర్కొన్నారు.
శిక్షణ పూర్తయిన అనంతరం అందించే సర్టిఫికెట్ ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కుట్టుశిక్షణ ద్వారా మహిళలు తమ కుటుంబ అవసరాలకు తోడ్పడడమే కాకుండా ఆర్థిక స్వావలంబన సాధించి మహిళా సాధికారత దిశగా ముందుకు సాగగలరని అన్నారు.ఒక మహిళ స్వంతంగా సంపాదించగలిగితే కుటుంబంలో, సమాజంలో ఆమె గౌరవం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.మహిళలకు ఉపాధి కల్పించే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకమని తెలిపారు. అనంతరం కుట్టుశిక్షణ పూర్తి చేసిన మహిళలు స్వయంగా కుట్టిన దుస్తులను ఎమ్మెల్యే పరిశీలించారు.అలాగే జయచంద్ర రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు ఒక పీకో మిషన్ అందజేయడం జరిగింది.ఈ పీకో మిషన్ ద్వారా మహిళలు అదనపు ఆదాయం సంపాదించుకునే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే వివరించారు.ఈ సందర్భంగా లింగోజిగూడ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు తిలక్ రావు తన వంతు సహాయంగా మరో పీకో మిషన్ అందజేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తోట రాజశేఖర రెడ్డి,శ్రీధర్,ట్రైనర్ కళావతి తదితరులు పాల్గొన్నారు.

## నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించిన డీసీపీ అనురాధ ఐపిఎస్ జిహెచ్ఎంసి అధికారులు

**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**





భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో సోమవారం రోజు ఎల్బీనగర్ వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తించిన నీరు నిలిచే ప్రాంతాలను ఎల్బీనగర్ పోలీసులు,ట్రాఫిక్ పోలీసులు అదేవిదంగా జీహెచ్ఎంసీ అధికారులతో ఎల్బీనగర్ డీసీపీ అనురాధ ఐపిఎస్ కలిసి పరిశీలించారు.
ప్రజల భద్రత కోసం చేపట్టిన నివారణ చర్యలు,ట్రాఫిక్ ఏర్పాట్లను సమీక్షించారు. స్థానిక పోలీసులకు సమస్యాత్మక ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ,నీరు నిల్వ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని ఆదేశించారు.వర్షాల సమయంలో ప్రజలు నీరు నిలిచిన రహదారులను వీలైనంత వరకు నివారించి,తగిన జాగ్రత్తలు పాటించగలరు.

## ఒక మహిళగా కష్టాల్లో ఉన్న ప్రతి మహిళ కు తన కష్టాల్లో అండగా నిలబడతా..

### పట్నాల సావిత్రి మహిళా వింగ్ ఉపాధ్యక్షురాలు..




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
నూతనంగా ఆవిర్భవించిన గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అండ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంస్థ తెలంగాణ రాష్ట్ర మహిళా వింగ్ ఉపాధ్యక్షురాలుగా పట్నాల సావిత్రి నియామకం. గౌరవప్రదమైన పదవీ బాధ్యతలు అప్పగిస్తూ నియామక పత్రాన్ని ఈ సందర్భంగా అందజేసిన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, గౌరవనీయ కె. చక్రవర్తి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ అండ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ముఖ్య లక్ష్యాలను తెలిపారు.1. సమాజంలో అవినీతిని నిర్మూలించడానికి కృషి చేయడం. 2. ప్రజల హక్కుల పరిరక్షణకు మరియు న్యాయం కోసం పోరాడటం.3. పారదర్శకమైన పాలన కోసం ప్రభుత్వ వ్యవస్థలకు సహకరించడం.4యువతలో అవినీతి వ్యతిరేక స్ఫూర్తిని నింపడం.

అదేవిధంగా మానవ హక్కుల పరిరక్షణ,అవినీతి నిర్మూలన, వినియోగదారుల రక్షణ కోసం తన శక్తివంచన లేకుండా, నిబద్ధతతో పనిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఈ సంస్థ ఆశయాలు, లక్ష్యాల సాధన కోసం తనను తాను అంకితం చేసుకుంటానని, ఒక మహిళగా, అన్యాయం జరిగిన ప్రతి ఆడబిడ్డకు అండగా నిలబడతానని
హామీ ఇచ్చారు.
సంస్థ తనపై పెట్టిన బాధ్యత ను నమ్మకాన్ని వమ్ము చేయను.సంస్థ గర్వపడేలా అందరి ఆశీస్సులతో పనిచేస్తాను అని ఈ సందర్భంగా పట్నాల సావిత్రి తెలియజేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# గజ్వేల్ వక్ఫ్ బోర్డు భూములలో అక్రమ నిర్మాణాలు

**సర్వే నెంబర్ 400 లో అనుమతులు లేకుండా అడ్డగోలుగా నిర్మాణాలు..**

**పట్టించుకొని టౌన్ ప్లానింగ్ అధికారులు..**

**వక్ఫ్ బోర్డు భూముల కబ్జాలో అధికారూలదే పూర్తి సహకారం..**

**మాజీ కమిషనర్ వెంకట గోపాల్ కనుసైగల్లో నిర్మాణ పనులు జరుగుతున్నాయా?**

**టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ దీపికకు మామూలు అందితే అనుమతులు అవసరం లేదా.?**

**మున్సిపల్, రెవిన్యూ అధికారుల మామూళ్ల దందా.?**


**వక్ఫ్ బోర్డు భూములను కాపాడాల్సిన మూతవల్లీ విధులు మరిచాడా?**



**సిద్దిపేట,(ప్రజావినికిడి):**
వక్ఫ్ భూములను కాపాడుకోవడంలో తెలంగాణ వక్ఫ్ బోర్డు ఘోరంగా విఫలమైందని గజ్వేల్ నియోజకవర్గంలో వక్ఫ్ బోర్డు భూములు క్రమంగా కనుమరుగవుతున్నాయన్న విషయం గమనిస్తే అర్థమవుతుంది. కోట్ల విలువైన ఈ భూములు ఎలాంటి అనుమతులు లేకుండా ఆక్రమణలకు గురవుతూ,అక్రమ నిర్మాణాలు వేగంగా పెరుగుతున్నాయి. బాధ్యత వహించాల్సిన అధికార యంత్రాంగం మాత్రం మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది.
స్థానికంగా అందుతున్న సమాచారం ప్రకారం,16వ వార్డు సర్వేనెంబర్ 400 లో వక్ఫ్ బోర్డు భూములపై కొందరు కబ్జా చేసి ఇలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టి, అసలు అనుమతులు లేకుండా దుకాణాలు, బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనక లంచాలే కారణం అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.
ఇలాంటి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన మున్సిపల్ కమిషనర్ కార్యాలయం పూర్తిగా అవినీతి అక్రమాలను నిర్లక్ష్యంను ప్రదర్శిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మాజీ కమిషనర్ వెంకట గోపాల్, ప్రస్తుత సెక్షన్ ఆఫీసర్ దీపిక భారీ స్థాయిలో లంచాలు తీసుకొని పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడం ప్రజల్లో ఆగ్రహానికి కలిగిస్తోంది.

### లంచాలలో మునితేలుతున్న రెవెన్యూ అధికారులు..

గజ్వేల్ నియోజకవర్గం లో రెవిన్యూ శాఖ పాత్ర కూడా ప్రశ్నార్థకంగా మారింది.ప్రభుత్వ భూములను రక్షించాల్సిన అధికారులే మౌనం వహించడం వెనుక లంచాల వ్యవహారం ఉందా.? అనే అనుమానం వ్యక్తమవుతోంది. భూముల రికార్డులు మార్పులు,సర్వే లోపాలు, ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం చేయడం అన్ని కలిసి ఆక్రమణదారులకు అనుకూల పరిస్థితులు సృష్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.


గజ్వేల్ మాజీ మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్

### మూతవల్లీ క ను సైగల్లో వర్క్ బోర్డ్ భూములు స్వాహా

గజ్వేల్ నియోజకవర్గంలో
అత్యంత ఆందోళన కలిగిస్తున్న విషయం ఏమిటంటే మూతవల్లిలా రక్షణలో ఉండాల్సిన భూములు భక్షనకు గురికావడం వెనక వాళ్ల హస్తం ఉందని వక్ఫ్ బోర్డు రక్షణలో ఉండాల్సిన భూముల నిబంధనల, పాలకుల లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొంతమంది ముతావల్లీలు, సిబ్బంది భారీగా లంచాలు తీసుకొని ఆక్రమణదారులకు పూర్తిగా సహకరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అంతర్గతంగా జరుగుతున్న ఈ అవినీతి సహకారం వల్లే భూములు వేగంగా కబ్జా అవుతున్నాయని స్థానిక వర్గాలు పేర్కొంటున్నాయి.ఇప్పటికైనా గజ్వేల్ మున్సిపల్ కమిషనర్, ఎమ్మార్వో, ఉన్నతాధికారులు స్పందించి,గజ్వేల్ పరిధిలోని వక్ఫ్ భూములపై ప్రత్యేక సర్వే నిర్వహించి కబ్జా చేసిన నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.
వక్ఫ్ భూములు మతపరమైన, సామాజిక అవసరాలకు ఉపయోగపడాల్సిన ఆస్తులు. అలాంటి



భూములు కొందరి స్వార్థానికి బలి కావడం తీవ్రంగా ఖండించాల్సిన విషయం. మూతావల్లీ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి వక్ఫ్ బోర్డు భూముల కబ్జాలను అరికట్టకపోతే, భవిష్యత్తులో మరింత పెద్ద స్థాయిలో నష్టం సంభవించే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఇప్పటికైన అధికారుల చర్యలు ఉంటాయా.? లేక విధి నిర్వహణలో నిర్లక్ష్యం, మౌనం కొనసాగుతుందా.? అనేది చూడాల్సిందే.

## కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఘనంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు..

**వేడుకల్లో పాల్గొన్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

**విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసిన ప్రజాప్రతినిధులు**



**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
మొయినాబాద్ మండల పరిధిలోని నదీమ్‌నగర్ గ్రామంలోని కస్తూర్బా ప్రభుత్వ బాలికల పాఠశాలలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,ఇతర ప్రజాప్రతినిధులు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్,ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, చేవెళ్ల కాంగ్రెస్ ఇంచార్జి భీం భరత్ తదితరులు పాల్గొన్నారు.





## తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా గిరి యాదయ్య

**అంబర్ పేట్, (ప్రజావినికిడి):**
తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య ను నియమించారు. ఈ సందర్భంగా గిరి యాదయ్య మాట్లాడుతూ, మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నా యొక్క బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడంతోపాటు,రాష్ట్రంలో మెడికల్ ఉద్యోగుల సమస్యలను వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకుపోయి మెడికల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ ఎన్నికకు సహకరించిన మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కాంమెరెడ్ భూపాల్,రాష్ట్ర అధ్యక్షులు ఫసియుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యదా నాయక్ లకు కృతజ్ఞతలు తెలిపారు.



## యూరియా యాప్‌తో రైతులకు కష్టాలు..

### చౌదరి గూడెం రైతు వేదికలో అవగాహన సదస్సు

**కాంగ్రెస్ పార్టీ జిల్లేడు చౌదరి గూడెం మండల అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం లో రైతుల మెడపై యాప్ అనే గుదిబండను ఉంచి బిజెపి కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ మనుగడతో చెలగాటం ఆడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లేడు చౌదరిగుడ మండల అధ్యక్షుడు ఎన్ చంద్రశేఖర్ తీవ్రంగా విమర్శించారు.
చౌదరి గూడెం రైతు వేదికలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు షాద్ నగర్ ఏడి రమాదేవి తదితర రైతులు నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఆన్లైన్ ఆప్ సమస్యలు,ఓటీపీ ఆలస్యం,ఆధార్ లింకింగ్ లోపాలతో రైతులు గంటల తరబడి యూరియా కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎరువుల సరఫరా విషయంలో యాప్ తెచ్చి తంటాలు పెట్టారని చంద్రశేఖర్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ రైతులకు కొత్త కష్టాలు తెచ్చిపెడుతోందన్నారు. యాప్‌లోని లోపాలను వెంటనే సరిదిద్దాలని,రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తమ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ వ్యవసాయ శాఖ అధికారుల సమీక్షలు పాల్గొని పలు సమస్యలను రైతుల తరపున వివరించగా వెంటనే వ్యవసాయ శాఖకు చెందిన రాష్ట్రస్థాయి అధికారులు స్థానిక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కొంత వెసులుబాటు తీసుకు వచ్చారని చంద్రశేఖర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల మేలు కోసం ఎల్లప్పుడు పాటుపడుతుందని మండల అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్ తెలిపారు. రైతులకు ఇబ్బందులు తలెత్తిన వెంటనే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెంటనే స్పందించి వ్యవసాయ శాఖ అధికారుల బృందంతో చర్చలు జరిపి యాప్ లో సడలింపులు తీసుకువచ్చినట్లు గుర్తు చేశారు. పంటకు సరిపడా యూరియా అందించడానికి నిలువలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు మొదట్లో కాస్త ఇబ్బందులకు గురవుతున్నప్పటికీ రాబోయే కాలంలో ఈ యాప్ ద్వారా ఎంతో మేలు జరగనుందని అన్నారు. అదేవిధంగా యాప్ పై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి కొంత వెసులుబాటు కల్పించినందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు రైతాంగం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు తుంపల్లి రామచంద్రయ్య,గుర్రంపల్లి జంగయ్య,రావిర్యాల నీలయ్య,ధర్మ తండా చందు నాయక్,పీర్జాపూర్ నర్సింలు,కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు చలివేంద్రం పల్లి రాజు,మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి, ఏదిరా మాజీ సర్పంచ్ బాలరాజ్,పద్మరం నర్సింలు,గ్రామాల నాయకులు రైతులు పాల్గొన్నారు.




## జిల్లా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీ సభ్యులుగా పెంటనోళ్ళ నరసింహ మాదిగ నియామకం..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**రంగారెడ్డి జిల్లా స్థాయి ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీ సభ్యులుగా రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం ఇన్ముల్ నర్వ గ్రామానికి చెందిన పెంటనోళ్ళ నరసింహ మాదిగ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు చేతుల మీదుగా నియామక పత్రం అందుకోవడం జరిగింది.
పెంటనోళ్ల నరసింహ మాదిగ ప్రస్తుతం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నడుస్తున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పని చేయుచున్నారు. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా దళిత,గిరిజన, బలహీన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అనేక సామాజిక ఉద్యమాలను చేపట్టిన అనుభవం నరసింహకి ఉంది. అంతేకాకుండా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం చేసిన చరిత్ర ఉన్నది. అందువల్లనే నరసింహ సేవా దృక్పథం,దళిత గిరిజన ప్రజలతో ఉన్న అనుబంధం,అనేక సామాజిక కార్యక్రమాలను చేపట్టిన అనుభవం ఉన్న కారణంగా గుర్తించి జిల్లాస్థాయి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ అండ్ విజిలెన్స్ కమిటీలో సభ్యులుగా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా పెంటనోళ్ళ నరసింహ మాదిగ మాట్లాడుతూ,ఈ స్థాయి గుర్తింపు రావడానికి కారకులైన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు 'పద్మశ్రీ ' మందకృష్ణ మాదిగకి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనపై నమ్మకంతో,తన సేవను గుర్తించి ఈ అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి అలాగే షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావుకి కృతజ్ఞతలు తెలిపారు. దళిత గిరిజన వర్గాల సంక్షేమం కోసం వారిపైజరుగుతున్నటువంటి దాడులు,దౌర్జన్యాలు,వివక్షత అణిచివేతలను నిరోధించడం కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు.

## నేడు షాద్‌నగర్ పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత, -విద్యుత్ అధికారుల వెల్లడి



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్‌నగర్ విద్యుత్ శాఖ (టీజీఎస్ పీడీసీఎల్) ఆధ్వర్యంలో (33 కె.వి/11 కె.వి)షాద్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని సోలీపూర్ ఫీడర్, నాగులపల్లి ఏజీయల్ ఫీడర్‌లలో చెట్ల కొమ్మల తొలగింపు (ట్రీ కట్టింగ్) పనులుచేపట్టనున్నందున జూన్ 16, 2026 (మంగళవారం) ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ అంతరాయం ఉండే ప్రాంతాలు:నాగులపల్లి (ఏజీయల్)రాసమల్లగూడెం,సోలీపూర్ సాయిబాలాజీ టౌన్‌షిప్, ఏబీ కాంప్లెక్స్,ఏబి విల్లాస్,డ్రీమ్‌ల్యాండ్ కాలనీ విద్యుత్ నిర్వహణ పనుల దృష్ట్యా వినియోగదారులు సహకరించాలని షాద్‌నగర్ పట్టణ ఏఈ విజ్ఞప్తి చేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రఘునాయక్‌కు జన్మదిన శుభాకాంక్షలు



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రఘునాయక్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నందిగామ మండల ఉప సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆవులమంద శివశంకర్ ఆధ్వర్యంలో రఘునాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆవులమంద శివశంకర్ మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న రఘునాయక్ ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్న నాయకుడని పేర్కొన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో మరింత కాలం ప్రజాసేవలో కొనసాగుతూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. రఘునాయక్ సేవలను కొనియాడిన నాయకులు, ఆయన నాయకత్వంలో కార్మికులు మరియు ప్రజలకు మరిన్ని సేవలు అందాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుమారస్వామి గౌడ్, వెంకటేష్ గౌడ్, బొమ్మగాళ్ల నరసింహులు, కిట్టు, అశోక్, కావలి కృష్ణ, కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ఆకస్మిక తనిఖీలు

**డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు: బసవేశ్వర్ - ఉదయం 4:30 గంటలకే కాలనీల్లో పర్యటించిన మున్సిపల్ చైర్మన్**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
వర్షాకాలం పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ అధికారులకు, పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం తెల్లవారు జామున 4:30 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు మున్సిపాలిటీలోని పలు కాలనీలను స్వయంగా సందర్శించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

వర్షాకాలం నేపథ్యంలో మురుగునీటి పారుదల సక్రమంగా జరిగేలా చూడాలని, డ్రైనేజీల్లో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించాలని పరిశుద్ధ కార్మికులకు సూచించారు.

ఈ వర్షాకాలం మొత్తం పారిశుద్ధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని చైర్మన్ సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి ఇప్పటికే మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఇతర అధికారులతో పలుమార్లు



సమావేశాలు నిర్వహించి అవసరమైన చర్యలపై చర్చించినట్లు తెలిపారు.

డ్రైనేజీ వ్యవస్థ పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రతి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అలాగే ప్రజలు కూడా చెత్తను డ్రైనేజీల్లో వేయకుండా మున్సిపాలిటీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి త్వరలోనే పూర్తిస్థాయి పనులు చేపడతామని తెలిపారు. తెల్లవారుజామున



నిర్వహించిన ఆకస్మిక తనిఖీల సందర్భంగా చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పరిశుద్ధ కార్మికులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం అభినందనీయమని పేర్కొన్నారు.

# సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో చంద్రబాబు భేటీ

**టెక్నాలజీ, సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్, ఏఐపై చర్చ -దాదాపు 30 నిముషాల పాటు ప్రధానితో బాబు భేటీ**

**అమరావతిజూన్ 15 (ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, పెట్టుబడులు, సాంకేతిక రంగ సహకారం, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి కీలక అంశాలపైసిఎం చంద్రబాబు చర్చించారు. ఏపీ అభివృద్ధికి అవసరమైన టెక్నాలజీ, సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాల్లో సహకారం అందించాలని సీఎం చంద్రబాబు సింగపూర్ ప్రధానిని కోరారు. ఆంధప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ తో సోమవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. సింగపూర్ ప్రధాని అధికారిక నివాసంలో సుమారు 30 నిమిషాల పాటు జరిగిన ఈ భేటీలో ముఖ్యంగా సెమీకండక్టర్ తయారీ ఎకోసిస్టమ్ అభివృద్ధి, నైపుణ్యాల పెంపు అంశాల్లో సింగపూర్ మద్దతు అవసరమని వివరించారు. అమరావతి సహా రాష్ట్రంలోని వివిధ నగరాలు, పట్టణాల్లో అర్బన్ గవర్నెన్స్, నగర ప్రణాళిక, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనలో భాగస్వామ్యం కావాలని సీఎం కోరారు. ఈ సందర్భంగా అమరావతి రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై సింగపూర్ ప్రధాని ప్రత్యేక ఆసక్తి చూపించారు. విద్యా సంస్థలు, అంతర్జాతీయ ప్రమాణాలతో చేపడుతున్న మౌలిక సదుపాయాల నిర్మాణాల గురించి లారెన్స్ వాంగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో అమరావతి ప్రపంచ స్థాయి నివాసయోగ్య నగరాల సరసన నిలుస్తుందని సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో ప్రజారోగ్య రంగం అభివృద్ధి, జనాభా



నిర్వహణకు సంబంధించిన చర్యలను కూడా వివరించారు. వ్యవసాయ రంగంపై కూడా ఇరువురు నేతల మధ్య చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి సేద్యం ద్వారా వ్యవసాయం చేస్తున్న విషయాన్ని సీఎం ప్రస్తావించారు. రాష్ట్రంలోని ఉద్యానవన, ఆక్వా ఉత్పత్తులను సింగపూర్ దిగుమతి చేసుకునే అవకాశాలను పరిశీలించాలని కోరారు. ప్రకృతి సేద్యం ఉత్పత్తులకు అంతర్జాతీయ ప్రమాణాల సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ వ్యవస్థలను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. పోర్టులు, ఎయిర్‌పోర్టుల అభివృద్ధితో పాటు వాణిజ్య, పారిశ్రామిక అవకాశాలను మరింత విస్తరించేందుకు ఆంధ్రప్రదేశ్, సింగపూర్ కలిసి పనిచేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. రాష్ట్రం 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంతో ముందుకు సాగుతోందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా తగ్గుదల, అందుబాటు గృహ నిర్మాణం, శిశువులు, చిన్నారుల సంరక్షణ వంటి సామాజిక అంశాలపై కూడా ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు. సేవల రంగం తరహాలోనే తయారీ, సరఫరా గొలుసు (సప్లై చైన్) రంగాలు కూడా భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని ఇద్దరు నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ భేటీ ద్వారా ఆంధ్రప్రదేశ్?సింగపూర్ సంబంధాలు మరింత బలోపేతం కావడంతో పాటు పెట్టుబడులు, సాంకేతిక సహకారం, పట్టణాభివృద్ధి, వ్యవసాయ ఎగుమతుల రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందని ఇరువురు నేతలు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటనలో భాగంగా సింగపూర్‌కి చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి తెలుగు ప్రజలు, ప్రవాస భారతీయులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో చంద్రబాబు ఓ పోస్టు పెట్టరు. తనకు, తన బృందానికి ఆత్మీయ స్వాగతం పలికిన తెలుగు ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి చూపించిన ప్రేమాభిమానాలు తనకు ఎంతో ఆనందాన్ని కలిగించాయని పేర్కొన్నారు.

# తెలంగాణలో 19 నుంచి భారీ వర్షాలు

## అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,,జూన్ 15 (ప్రజావినికిడి):**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 19వ తేదీ నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలపై నిరంతర నిఘా అవసరమని వారికి స్పష్టం చేశారు. విపత్తుల నిర్వహణ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి చెప్పారు. జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల తీవ్రత పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని ఉన్నతాధికారులకు తెలిపారు. ప్రజల ప్రాణాలతోపాటు వారి ఆస్తుల రక్షణెళి ప్రభుత్వ లక్ష్యమన్నారు. వర్షాకాలం ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.



# నగరశివారులో డ్రగ్స్ తయారీ గుట్టు రట్టు

## ముఠాను వలపన్ని పట్టుకున్న ఈగిల్ టీమ్




**హైదరాబాద్,జూన్ 15 (ప్రజావినికిడి);** హైదరాబాద్ నగర శివారులోని అబ్దుల్లా పూర్‌మెట్‌లో అత్యంత ప్రమాదకరమైన ఎండీఎంఏ డ్రగ్స్ తయారు చేస్తున్న ముఠా గుట్టును ఈగల్ టీం రట్టు చేసింది. సోమవారం డ్రగ్స్ తయారు చేస్తున్న నరేష్, మత్స్యగిరిలను ఈగల్ టీం అరెస్ట్ చేసింది. ఈ ముఠాలో సంతోష్ సింగ్ అలియాస్ రాజు అలియాస్ రాజేష్, విజయ్, అశ్విని పాఠక్ కీలక సభ్యులుగా ఉన్నారని ఈగల్ టీం తెలిపింది. అలాగే రూ.50 లక్షల విలువైన మెఫెడ్రోన్‌తోపాటు రసాయనాలను స్వాధీనం చేసుకుంది. రూ.50 లక్షల విలువైన ఆ ఫ్యాక్టరీని సీజ్ చేసింది. నరేష్, కీసర మత్స్యగిరిలు గత కొన్ని సంవత్సరాలుగా తప్పించుకుని తిరుగుతున్నారని ఈగల్ టీం వెల్లడించింది. రసాయన శాస్త్రవేత్త నుంచి అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా సభ్యులుగా వీరు ఎదిగారని తెలిపింది. గతంలో వీరు హత్యలు, దోపిడీలతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని వివరించింది. చివరకు వీరు డ్రగ్స్ తయారీదారులుగా మారారని తెలిపింది. అంతర్జాతీయ డ్రగ్స్ రాకెట్‌లో ఈ ముఠా కీలకంగా వ్యవహరిస్తుందని వెల్లడించింది. గత ఆరు నెలలుగా వీరి కోసం గాలిస్తున్నామని చెప్పింది. 2015 నుంచి దేశవ్యాప్తంగా అక్రమ డ్రగ్స్ తయారీ కేంద్రాలను ఈ ముఠా ఏర్పాటు చేసి.. తన కార్యకలాపాలు కొనసాగిస్తుందని ఈగల్ టీం వివరించింది.

---------------

# గోల్కొండ హత్య కేసు ఛేదించిన పోలీసులు

## ప్రేమ వివాహం చేసుకున్నందుకు మసూద్ హత్య

**హైదరాబాద్,జూన్ 15 (ప్రజావినికిడి);**
నగరంలోని గోల్కొండలో సంచలనం సృష్టించిన హత్య కేసును పాతబస్తీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సహా నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరు పరిచారు. వారికి కోర్టు జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. ప్రేమ వివాహమే ఈ హత్యకు ప్రధాన కారణమని పోలీసులు వెల్లడించారు. 2025, జనవరిలో రుక్సార్ బేగంను మసూద్ చాంది ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ వివాహాన్ని రుక్సార్ సోదరుడు





జాహెద్ తీవ్రంగా వ్యతిరేకించాడు. ఈ నేపథ్యంలో వారితో అతడు తరచూ ఘర్షణకు దిగేవాడు. జూన్ 12వ తేదీన సోదరి నివాసానికి తన బంధువులతో కలిసి వెళ్లి మసూద్‌పై జాహెద్ దాడి చేశాడు. ఇనుప రాడ్లు, కత్తులతో బలంగా దాడి చేయడంతో మసూద్ అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఈ దాడిని మసూద్ తండ్రి షేక్ ఇస్మాయిల్ అడ్డుకోబోయాడు. దాంతో ఆయన కూడా తీవ్రంగా గాయపడ్డాడు. హత్యపై ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏసీపీ సయ్యద్ ఫియాజ్ పర్యవేక్షణలో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో గోల్కొండలో వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ఇనుప రాడ్, కత్తిని గోల్కొండ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాత కక్షలు, ప్రేమ వివాహమే ఈ హత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

# సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్రలు

**ఓపెన్ కాస్ట్‌లత విస్తరణతో సంస్థకు నష్టం -సింగరేణి బకాయిలు 50వేల కోట్లు చెల్లించాలి**

**కార్మికుల హక్కుల కోసం హెచ్ఎంఎస్‌తో కలసి పోరాటం -బొగ్గుబాయిబాట కార్యక్రమంలో టీఆర్ఎస్ చీఫ్ కవిత**

**మంచిర్యాలజూన్ 15 (ప్రజావినికిడి);**
సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్రలు జరుగుతున్నాయని టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపించారు. కొత్త బొగ్గు బావులు తెచ్చుకుంటే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని, మన హక్కైన డిపెండెంట్ ఉద్యోగాల కోసం రాజీలేని పోరాటం చేయాల్సి ఉందన్నారు. సింగరేణిని కాపాడాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే.. వెంటనే సింగరేణికి బకాయి ఉన్న 50 వేల కోట్ల రూపాయలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను రద్దు చేసి, ఓపెన్ కాస్ట్ మైనింగ్‌ను పెంచుతూ సింగరేణి ఉనికిని దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలో చేపట్టిన బొగ్గుబాయి కార్యక్రమంలో భాగంగా.. కాసిపేట మైన్-1ను ఆమె సందర్శించారు. నేరుగా గనిలోకి వెళ్లి కార్మికులతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న కష్టాలను, సమస్యలను అడిగి తెలుసు కున్నారు. కాసిపేట నుంచే వారం రోజుల పాటు సాగనున్న ఈ 'బాయి బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా అవతరించిన టిఆర్ఎస్ కు సింగరేణి బిడ్డల ఆశీర్వాదం కావాలని ఆమె కోరారు. వారసత్వ ఉద్యోగాల్లో సింగరేణి కార్మికులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. సింగరేణి సంస్థ పరిరక్షణ కోసమే.. టీఆర్ఎస్, హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) కలిసి పని చేస్తున్నాయని చెప్పారు. పాలసీలు రూపొందించాల్సిన సీఎం, డిప్యూటీ సీఎంలే అధికారులకు వినతిపత్రాలు ఇస్తూ.. కార్మిక రంగాన్ని మభ్యపెడుతున్నారని విమర్శించారు. సింగరేణి సంస్థను ప్రైవేటీకరించడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.



అండర్ గ్రౌండ్ మైన్లను కాపాడుకోవడానికి హెచ్ఎంఎస్‌తో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో, ఆ తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వంలోనూ మనం కలిసి పనిచేశాం. నేను ఎక్కడున్నా అనునిత్యం మీ పక్కనే ఉండి పోరాడాను. గతంలో మెడికల్ బోర్డు కోసం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌ను ముట్టడించిన చరిత్ర మనది. కానీ ఈ ప్రభుత్వంలో.. సర్వసాధారణంగా జరగాల్సిన పనుల కోసం కూడా కార్మికులు రో÷-డడెక్కి పోరాడాల్సి వస్తోంది అంటూ కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ, హైదరాబాద్‌లలో ఉండి సింగరేణికి కొత్త బొగ్గు బావులు తేవాల్సిన సీఎం, డిప్యూటీ సీఎంలు.. ఇక్కడికి వచ్చి కార్మికులకే వినతిపత్రాలు ఇస్తూ మభ్యపెడుతున్నారని కవిత మండిపడ్డారు. ఐటీ సమస్యలను తీర్చడంలో, నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇప్పుడున్న కార్మికుల్లో ఎక్కువ మంది యువకులే ఉన్నారని.. కానీ వారి పిల్లల చదువుల కోసం సరైన స్కూళ్లు, వైద్యం కోసం కార్పొరేట్ ఆసుపత్రులు లేవని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. అన్నింటిలో ప్రైవేట్‌ను తీసుకొచ్చి వైద్యాన్ని ఖరీదు చేస్తున్నారని మండిపడ్డారు. అందుకే.. కార్మికుల రక్షణ కోసం, వారి కుటుంబాల సంక్షేమం కోసం 'తెలంగాణ రక్షణ సేన పాంచజన్యం' అనే ఐదు కీలక అంశాలతో ముందుకు వచ్చిందని కవిత ప్రకటించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీ స్థాయిలో, జేబీసీసీ లో కార్మికుల హక్కుల కోసం హెచ్.ఎమ్.ఎస్. అధ్యక్షుడు రియాజ్‌తో కలిసి టిఆర్ఎస్. సంయుక్తంగా, రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కొత్త పార్టీ స్థాపించాక సింగరేణిలో ఇదే తన మొదటి యాత్ర అని పేర్కొంటూ.. కార్మికుల దీవెనలు ఎల్లప్పుడూ తమపై ఉండాలని కవిత కాంక్షించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# నేలవిడిచి సాము చేస్తున్న ప్రాంతీయ పార్టీలు !

**జూన్ 15 (ప్రజావినికిడి);**

కాంగ్రెస్ నుంచి విడివడి ఏర్పడ్డ ప్రాంతీయ పార్టీలు అన్నీ మళ్లీ కాంగ్రెస్‌లో విలీనం కావాలని, అప్పుడే బిజెపి వ్యతిరేక పోరాటం బలోపేతం అవుతుందని శివసేన ఎంపి సంజయ్ రౌత్ ఈ మధ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. తృణమూల్ కాంగ్రెస్, శరద్ పవార్ పార్టీలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన ఎందుకు అన్నారో కానీ, బిజెపిని దెబ్బతీయాలంటే కాంగ్రెస్ బలోపేతం కావాలన్న ఉద్దేశ్యంతో అలా అని వుంటారు. రెండు పార్టీల వ్యవస్థ ఉండివుంటే ఇలాంటిదే జరుగుతుంది. ఇష్టమున్న పార్టీలు ఆ రెండు పార్టీల్లో చేరుతాయి. అది బిజెపి లేదా కాంగ్రెస్ కావచ్చు. కానీ భారత ప్రజాస్వామ్యంలో ప్రాంతాయ పార్టీల పాత్రను తక్కువగా అంచనావేయలేం. ఒకప్పుడు కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యంగా, నిరంకుశంగా చేస్తున్న పాలనకు వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలు పుట్టుకురావడం చూశాం. కమ్యూనిస్టులు పూర్తిగా బలహీనపడి, దేశంలో కమ్యూనిజం అంతం కావడంతో ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు కొన్ని ప్రాంతీయ పార్టలు తమ ప్రభావం చూపుతున్నాయి. ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్ నిరంకుశ పాలనపై ఎన్టీఆర్ తిరుగుబాటు చేశారు. తెలుగుదేశం పార్టీ ఏర్పడి ఇప్పటికీ బలంగా నిలిచింది. ఇటీవల తమిళనాడులో ద్రవిడ పార్టీలపై యుద్ధం ప్రకటించిన టివికె పార్టీ ఏకంగా అధికారంలోకి వచ్చింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ప్రాంతీయ పార్టీలు ఇప్పుడు మనుగడ సాగిస్తున్నాయి. ఆయా పార్టీలు కాంగ్రెస్‌లో విలీనం అయితే జరిగేది కాంగ్రెస్ బలోపేతం మాత్రమే. కాంగ్రెస్ దేశంలో కుటుంబ పాలన సాగిస్తున్న పార్టీ. అక్కడ సోనియా, రాహుల్, ప్రియాంకల పెత్తనం తప్ప ఇతరులకు అఇకారం ఉండదు. పేరుకే ఖర్గే జాతీయ పార్టీ అధ్యక్షుడు. ఆయన మాట కూడా చెట్టుబాటు కాదు. అలాంటి పార్టీలో ప్రాంతీయ పార్టీల విలీనం కావాలన్న ఆలోచన సరికాదు. దీంతో ఎలాంటి రాజకీయ ప్రయోజనం ఉండదు. అందువల్ల సంజయ్ రౌత్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం లేదు. ఇకపోతే కాంగ్రెస్ ముక్త భారత్ పిలుపునిచ్చిన మోడీ కూడా కాంగ్రెస్‌ను ఏమీ చేయలేక పోయారు. ఆయా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను కూడా బిజెపి ఏమీ చేయలేకపోతున్నది. దేశంలో ప్రజల ఆదరణ ఉన్నంత వరకు ఏ పార్టీ అయినా ఉంటుంది. బెంగాల్‌ను తీసుకుంటే ప్రాంతీయ పార్టీగా తృణమూల్ విఫలం అయ్యింది. ఒక ఆడబిడ్డ చేతిలో దేశ భద్రతకు భంగం ఏర్పడింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల్లో ఓడిపోయిన కొద్దిరోజులకే చిన్నాభిన్నం అవుతోంది. ఇది స్వయంకృతంగా చూడాలి. అంతమాత్రాన కాంగ్రెస్‌లో విలీనం అయితే, భ్రష్టత్వం కాంగ్రెస్‌కు కూడా అంటుకుంటుంది. ఇకపోతే ఇండియా కూటమిలో ఉన్న పార్టీలు బలమైన వాణిని వినిపించడం లేదు. అందుకే ఎన్‌డిఎ వైఫల్యాలపై గట్టిగా పోరాడ లేకపోతున్నాయి. అధికారమే లక్ష్యంగా అన్ని పార్టీలు రాజకీయాలు నడుపుతున్నాయి తప్ప ప్రజల కోణంలో ఆలోచన చేయడం లేదు. దళితుల గురించి అన్ని పార్టీలు గొప్పలు చెబుతున్నా ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ




పూర్తికాలం ముఖ్యమంత్రి అయిన దాఖలాలు లేవు. బెంగాల్లో గతంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ పరిపాలించినా అవకాశం దళితులకు దక్కలేదు. తమిళనాడులో డీఎంకే అధికారం కోల్పోయినప్పటికీ మరో ప్రాంతీయ పార్టీ అధికారం చేపట్టింది. కేరళలో అధికారం కోల్పోయాక ఇప్పుడు దేశంలో కమ్యూనిస్టు పార్టీలు క్రమంగా కనుమరుగయ్యే స్థితి కనబడు తున్నది. బిహార్‌లో ఆర్జేడీది అదే పరిస్థితి. ఒడిశాలో కూడా నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్ అదే బాటలో ఉంది. ప్రాంతీయ పార్టీలు ప్రజల్లో బలంగా లేకపోవడం స్వార్థ చింతనతో పాలన చేయడం, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోక పోవడం వంటి కారణాలతో కనుమరుగు అవుతున్నాయి. ఉమ్మడి ఎపిలో, ఇప్పుడు విభజిత ఎపిలోతెలుగుదేశం పార్టీ ఇంకా గట్టిగా నిలబడి ఉందంటే అందుకు ప్రజల మద్దతు కారణమని చెప్పాలి. వైఎస్ జగన్ ప్రాంతీయ పార్టీని ప్రజలు నమ్మి ఓటేస్తే ఆయన దానిని నిలబెట్టుకోలేక పోయారు. టిడిపి, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ కూడా ఫక్తు కుటుంబ పార్టీలుగా మారాయి. అలాగే తెలంగాణలో బిఆర్ఎస్ కూడా కేవలం కుటుంబ పార్టీగా మారింది. ఇలాంటి పార్టీలను ప్రజలు దీర్ఘకాలం నమ్మరని గుర్తించాలి. ఈ స్థితిలో ప్రాంతీయపార్టీలు మారాలి. సమాజంలో అన్నివర్గాల ప్రజలను కలుపుకుని పోవాలి. ప్రజల ఎజెండాను తమ లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలి. ప్రాంతీయ పార్టీలకు జాతీయ దృక్పథం ఉండాలి. ఆయా రాష్ట్రాల్లో పాలనలో భిన్నత్వం కనిపించాలి. అభివృద్ధిని ఆలంబనగా చేసుకుని ముందుకు సగాలి. లేకుంటే ఆయా పార్టీలను ప్రజలు విసిరి అవత పారేస్తారు. బెంగాల్లో అదే జరిగింది. దేశంలోని ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపిలకు భిన్నంగా పాలన సాగించాలి. ఆయా రాష్ట్రాలను అభివృద్ధిలో ముందు వరసలో నిలబెట్టాలి. జాతీయ పార్టీలకన్నా ప్రాంతీయ పార్టీలే నయమని నిరూపించాలి. ఈ ప్రయత్నంలో తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పాలనలో తనదైన ముద్ర వేశారు. దళితులు,గిరిజనలు, బిసిలను రాజకీయంగా ఎంచుకుని వారిని ముందుకు నడిపించారు. ఓ రకంగా ఆయన విప్లవం సాధించారనే చెప్పాలి. అలాగే ఓటు బ్యాంక్ రాజకీయాలకు పోకుండా అభివృద్ధి రాజకీయాలను చేస్తే ప్రజలు తప్పకుండా ప్రాంతీచయ పార్టీలను ఆదరిస్తూనే ఉంటారు. ఎందుకంటే కాంగ్రెస్, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆయా ముఖ్యమంత్రులకు స్వేచ్ఛ ఉండదు. జాతీయ పార్టీ కనుక ఢిల్లీ ఆదేశాలను పాటించాల్సి ఉంటుంది. ఈ విషయంలో కాంగ్రెస్ ముందున్నది. చీమచిటుక్కుమన్నా కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలకు చెప్పాల్సిందే. స్వతంత్ర నిర్ణయాలకు అక్కడ ఆస్కారం ఉండదు. ప్రాంతీయ పార్టీలు జాతీయ ప్రత్యామ్నాయంగా మారితేనే కాంగ్రెస్ , బిజెపిలకు కొంత చెక్ పడుతుంది.

# కేరళలో నిఫా వైరస్ కలకలం

### కోజికోడ్ జిల్లాలో ఒక వ్యక్తికి నిఫా వైరస్ నిర్ధారణ -మెడికల్ కాలేజీ ఐసియూలో చికిత్స

### వైద్యశాఖను అప్రమత్తం చేసిన ప్రభుత్వం -కేరళలో వైరస్ భయంతో అప్రమత్తం అయిన తమిళనాడు

**తిరువనంతపురం,జూన్ 15 (ప్రజావినికిడి);**

దక్షిణ భారత రాష్ట్రాల్లో మరోసారి నిఫా వైరస్ భయం నెలకొంది. కేరళలోని కోజికోడ్ జిల్లాలో ఒక వ్యక్తికి నిఫా వైరస్ సోకినట్లు నిర్ధారణ కావడంతో రాష్ట్ర యంత్రాంగం అత్యవసర చర్యలు చేపట్టింది. కోజికోడ్ లోని రమణట్టుకర మున్సిపాలిటీ పరిధికి చెందిన 43 ఏళ్ల వ్యక్తి ప్రస్తుతం కోజికోడ్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలోని ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు.

పూణెలోని జాతీయ వైరాలజీ సంస్థ నుంచి వైరస్ నిర్ధారణ నివేదిక అందిన వెంటనే కేరళ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలను అప్రమత్తం చేసింది. వైద్య నిపుణుల సూచనల మేరకు బాధితుడికి మోనోక్లోనల్ యాంటీబాడీ చికిత్సను కూడా ప్రారంభించారు. బాధితుడితో ఇటీవల సన్నిహితంగా మెలిగిన వారిని

గుర్తించేందుకు అధికారులు విస్తృత స్థాయిలో కాంటాక్ట్ ట్రేసింగ్ నిర్వహించారు. మొత్తం 87 మందిని పర్యవేక్షణ జాబితాలో చేర్చారు. వీరిలో 58 మంది ఆరోగ్య సిబ్బంది, 14 మంది కుటుంబ సభ్యులు, ఐదుగురు స్నేహితులు ఉన్నారు. అధిక ప్రమాదంలో ఉన్న వ్యక్తులను ముందస్తు జాగ్రత్తగా క్వారంటైన్‌లో ఉంచారు. అయితే, ప్రస్తుతం పర్యవేక్షణలో ఉన్న ఎవరికీ వైరస్ లక్షణాలు కనిపించలేదని, ఇప్పటివరకు సేకరించిన నమూనాల పరీక్ష ఫలితాలు నెగెటివ్‌గా వచ్చాయని కేరళ ఆరోగ్య శాఖ వెల్లడించింది. వైరస్ సమాజంలో విస్తరించిన సూచనలు లేవని, అందువల్ల ప్రస్తుతం కంటైన్‌మెంట్ జోన్లు ప్రకటించే అవసరం లేదని అధికారులు తెలిపారు. పరిస్థితిని సమీక్షించేందుకు జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం నిపుణుల బృందం కూడా కోజికోడ్ కు చేరుకుంది. కేరళలో నిఫా కేసు వెలుగులోకి రావడంతో పొరుగు రాష్ట్రం తమిళనాడు కూడా అప్రమత్తమైంది.



కేరళతో సరిహద్దు కలిగిన నీలగిరి, కోయంబత్తూర్, తేని, కన్యాకుమారి, కడలూరు జిల్లాల్లో ఆరోగ్య శాఖలను సిద్ధంగా ఉంచింది. తాళూర్, నాడుగని, నంబియార్‌కున్ను, సోలాడి, పట్టవాయల్ తదితర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక వైద్య బృందాలను మోహరించి కేరళ నుంచి వచ్చే ప్రయాణికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద లక్షణాలు ఉన్నవారిని వైద్య శిబిరాలకు తరలించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచుతున్నారు. కేరళ నుంచి తమిళనాడులోకి వైరస్ వ్యాపించకుండా నిరోధించడానికి సరిహద్దు జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో సరిహద్దులను పంచుకునే ప్రాంతాలతో పాటు పర్యాటక ప్రాంతాలైన నీలగిరి (ఊటీ), కోయంబత్తూరు జిల్లాలపై ఆరోగ్య శాఖ ప్రత్యేక నిఘా ఉంచింది. తమిళనాడు పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ ఆదేశాల ప్రకారం.. కేరళ సరిహద్దుల్లోని వాలామార్, ఉడుమలైపేట, నాడుగాని, తాళూర్, చోలాడి, పాట్టవయల్ సహా 13 కీలక అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఆరోగ్య శాఖ ప్రత్యేక బృందాలను మోహరించింది. చెక్‌పోస్టుల వద్ద 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేశారు. కేరళ నుంచి వచ్చే ప్రయాణికులు, పర్యాటకులు, నిత్యం పనుల కోసం సరిహద్దులు దాటే వలస కూలీలకు థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, వాంతులు వంటి నిఫా ప్రాథమిక లక్షణాలు ఉన్నవారిని అధికారులు ప్రత్యేకంగా గుర్తిస్తున్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారిని వెంటనే ఐసోలేషన్‌కు తరలించేందుకు సరిహద్దుల్లో అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. నీలగిరి జిల్లా కలెక్టర్, ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేట్ క్లినిక్‌లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జ్వరం లేదా మెదడు వాపు లక్షణాలతో వచ్చే రోగుల వివరాలను, వారి ట్రావెల్ హిస్టరీని నిరంతరం గమనించాలని, ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే స్టేట్ సర్వైలెన్స్ విభాగానికి నివేదించాలని స్పష్టం చేశారు.ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు నిఫా వైరస్ వ్యాప్తికి అనుకూల కాలంగా భావిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గబ్బిలాలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలకు దూరంగా ఉండాలి. గబ్బిలాలు లేదా పక్షులు కొరికిన పండ్లను తినకూడదు. పెంపుడు జంతువులను తాకిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి.ప్రజలు పుకార్లను నమ్మకుండా అధికారిక సమాచారం ఆధారంగా మాత్రమే వ్యవహరించాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఫ్యూచర్ సిటీ కోసం శరవేగంగా అడుగులు

### సింగపూర్ కంపెనీకి మాస్టర్ ప్లాన్ బాధ్యతలు?

**హైదరాబాద్,జూన్ 15 (ప్రజావినికిడి);** ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన సిఎం రేవంత్ రెడ్డి ఇటీవలఏ అక్కడ ఫ్యూచర్ సిటీ వెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయాన్ని ప్రారంభించారు. దీనికితోడు మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేస్తున్నారు. రానున్న ఆరేడేళ్లలో ఫ్యూచర్ సిటీని అందుబాటులోకి తీసుకుని రావడం లక్ష్యంగా శరవేగంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీనికితోడు కొన్న ప్రభుత్వ కార్యాలయాలను అక్కడికి తరలిస్తున్నట్లు వార్తలు వస్తున్నారు. ఇదే క్రమంలో ఫ్యూచటర్ సిటీ మాస్టర్ ప్లాన్ ఈ బాధ్యతలను సింగపూర్ కంపెనీకి ప్రభుత్వం అప్పగించినట్లు తెలుస్తున్నది. ఇందుకోసం గ్లోబల్ టెండర్లను పిలువగా.. ఆరు సంస్థలు టెండర్లలో పాల్గొన్నాయి. అందులో సింగపూర్‌కు చెందిన డీపీ ఆర్కిటెక్ట్స్ అనే సంస్థ లోయెస్ట్ బిడ్డర్‌గా నిలిచిందని సమాచారం.దీంతో ఆ సంస్థకే మాస్టర్ ప్లాన్ తయారీ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించినట్టు సమాచారం. 765 చదరపు కిలోమీటర్ల మేర ఫ్యూచర్ సిటీకి ఆ సంస్థ మాస్టర్ ప్లాన్ తయారు చేయనున్నది. 9 నెలల్లో మాస్టర్ ప్లాన్‌ను తయారు చేసి ఇచ్చేలా సంస్థకు బాధ్యతలు అప్పగించినట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి. తొలిదశలో భాగంగా 30 వేల ఎకరాలపై మాస్టర్ ఎ÷-లాన్‌ను సిద్ధం చేయనున్నారు. అందులో భాగంగా



వేటికి ఎంత భూమి వినియోగించాలి.. మౌలికవసతుల అవసరాలు, అభివృద్ధి ప్రాధాన్యాలను ప్లాన్‌లో పొందుపరచ నున్నారు. మొత్తంగా 30 వేల ఎకరాల్లో 13 వేల ఎకరాలను మౌలికవసతులు, పారిశ్రామిక అవసరాల అభివృద్ధికి వాడుకోబోతున్నారు. డెవలప్‌మెంట్‌లో భాగంగా లైఫ్‌సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలుస్తున్నది. 13 వేల ఎకరాల్లో సింహభాగం లైఫ్?సైన్సెస్‌కు కేటాయించనున్నారు. 4 వేల ఎకరాల్లో లైఫ్‌సైన్సెస్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఆ తర్వాత 2,177 ఎకరాల్లోఎలక్ట్రానిక్స్ అండ్? అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్? జోన్‌ను అభివృద్ధి చేస్తారని తెలుస్తున్నది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వెహికల్స్‌కు ట్రెండ్, డిమాండ్ పెరగడంతో దానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఎలక్ట్రిక్ వెహికల్స్, ఎనర్జీ పార్క్ కోసం దాదాపు 2 వేల ఎకరాలు కేటాయించినట్టు తెలిసింది. ఏఐ సిటీ కోసం 400 ఎకరాలు, డేటా సెంటర్ హబ్ కోసం 310 ఎకరాలు, హెల్త్ సిటీకి 594 ఎకరాలు, ఎడ్యుకేషన్ అండ్ యూనివర్సిటీ డిస్ట్రిక్ట్ కోసం 255 ఎకరాల కేటాయింపులు చేసినట్టు చెబుతున్నారు. వాటితోపాటు రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ల అభివృద్ధి కోసం 2,477 ఎకరాలను కేటాయించారు. మిక్స్‌డ్‌యూజ్‌పర్పస్‌లో ఎంటర్‌టైన్‌మెంట్, స్పోర్ట్స్, ఫర్నీచర్? మాన్యుఫ్యాక్చరింగ్‌కు కూడా భూములు కేటాయించినట్టు చెబుతున్నారు. ట్రాన్స్‌పోర్ట్ కారిడార్లు, యుటిలిటీ నెట్‌వర్క్స్, సోషల్? ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వాణిజ్య ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణ ప్రాంతాలను మాస్టర్ ప్లాన్‌లో పొందు పరచనున్నారు. ప్రస్తుతం ఎఫ్?సీడీఏ ప్రాంతం వివిధ హద్దుల్లోకి వస్తున్నది. ఉత్తర భాగంలోని కొన్ని ప్రాంతాలు హెచ్ఎండీఏ, మధ్యభాగంలో హైదరాబాద్ ఫార్మా సిటీ ఏరియా ఉంటున్నది. దక్షిణ భాగం గ్రామీణ ప్రాంతాలే ఉన్నాయని చెబుతున్నారు. ప్లాన్ ప్రకారం సిటీ అభివృద్ధిపై సమగ్ర ప్రణాళికను పొందుపరుస్తారని అధికారులు చెబుతున్నారు.

## అమెరికా మిస్సోరిలో కుప్పకూలిన విమానం

### ప్రమాదంలో 12 మంది దుర్మరణం



**వాషింగ్టన్,జూన్ 15 (ప్రజావినికిడి);**

అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రంలో ఓ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న 12 మంది చనిపోయారు. స్కైడైవింగ్ చేసే వారిని తీసుకెళ్తుండగా బట్లర్ మెమోరియల్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఈదుర్ఘటన జరిగింది. ప్లేన్ టేకాఫ్ అయిన తర్వాత రన్‌వేకు సుమారు 300 గజాల దూరంలో క్రాష్ అయింది. చనిపోయిన వారిలో 11 మంది స్కైడైవర్లు, ఒక పైలట్ ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## సినీ నటికి వేధింపులు

### క్యాస్టింగ్ ఆర్టిస్ట్‌పై కేసు నమోదు

**హైదరాబాద్,జూన్ 15 (ప్రజావినికిడి); ):** సినిమా అవకాశాల పేరుతో ఓ నటిని వేధించడమే కాకుండా, రావాల్సిన పారితోషికం ఇవ్వకుండా మోసం చేసిన క్యాస్టింగ్ ఆర్టిస్ట్ ప్రసాద్‌పై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. 'ఆకాశంలో ఒక తార' సినిమాలో నటింపజేసినందుకు గానూ సదరు నటికి ఇవ్వాల్సిన రూ.90 వేల పారితోషికం, రూ.38 వేల ప్రయాణ ఖర్చులను ఇవ్వకుండా నిందితుడు కాలయాపన చేశాడు. ఈ క్రమంలోనే గత ఫిబ్రవరిలో బంజారాహిల్స్‌కు పిలిపించి, బకాయిలు ఇవ్వకుండా బెదిరించడమే కాకుండా.. బలవంతంగా కారులో ఎక్కించుకుని మరిన్ని అవకాశాలు ఇస్తానంటూ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. భయంతో అక్కడి నుంచి వెళ్ళిపోయిన బాధితురాలు జరిగిన విషయాన్ని తల్లికి చెప్పగా, ఆమె నిందితుడిని ఫోన్ లో నిలదీసింది. అయితే ఆమెను సైతం నిందితుడు దుర్భాషలాడి బెదిరించడంతో, బాధితురాలి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ఇరాన్‌తో శాంతి ఒప్పందంతో మార్కెట్లో మళ్లీ జోరు

### అమాంతంగా పెరిగిన బంగారం, వెండి ధరలు

**న్యూఢిల్లీజూన్ 15 (ప్రజావినికిడి);**

దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండికి మళ్లీ గిరాకీ పెరిగింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడం, చమురు ధరలు దిగిరావడం, రూపాయి విలువ బలోపేతం వంటి కారణాలతో ఈ లోహాల ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఇరాన్‌తో డీల్ కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీంతో




మూడు నెలలకు పైగా సాగిన యుద్ధానికి ముగింపు లభించినట్లయ్యింది. ఈ పరిణామాలతో ముడి చమురు ధరలు భారీగా దిగొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ 83 డాలర్లకు పడిపోయింది. అటు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 53 పైసలు బలపడి 93.65 వద్ద ట్రేడ్ అవుతోంది. సోమవారం హైదరాబాద్ లో 10 గ్రాముల మేలిమి 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,490 పలికింది. అటు వెండి ధర కూడా ఎగబాకింది. కేజీ వెండి ధర రూ.2.57లక్షలకు చేరింది. గతవారం ఒకదశలో బంగారం ధర రూ.1,50,000 కన్నా దిగువకు పడిపోయిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ విపణిలోనూ బంగారం, వెండికి డిమాండ్ పెరిగింది. స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 4,323 డాలర్లు, ఔన్సు వెండి ధర 70.38 డాలర్లకు చేరింది. గతవారం పసిడి ధర ఒక దశలో దాదాపు 4000 డాలర్లకు తగ్గింది. ఇక, కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.1,53,258గా ఉంది. వెండి ఫ్యూచర్స్ ధర రూ.2,52,383గా ట్రేడ్ అవుతోంది.

# అమ్మ ఫోన్ వస్తే ఎత్తాల్సిందే..

## - తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి



అఫ్ఘానిస్థాన్‌తో తొలి వన్డే ముగిసిన అనంతరం జరిగిన ప్రెస్ మీట్‌లో ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి రిపోర్టర్ల ప్రశ్నలకు సమాధానమిస్తుండగా.. అతడి తల్లి నుంచి ఫోన్ వచ్చింది. దాంతో ప్రెస్ మీట్‌ను కాసేపు ఆపిన నితీశ్.. 'అమ్మా.. 5 నిమిషాల్లో మళ్లీ చేస్తాను' అని తెలుగులో మాట్లాడి ఫోన్ కట్ చేశాడు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ధర్మశాల వేదికగా అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన తొలి వన్డేలో భారత్ ఘన విజయం సాధించి.. సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే మ్యాచ్ అనంతరం నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో టీమిండియా యంగ్ ఆల్ రౌండర్, తెలుగు క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డి పాల్గొన్నాడు. నితీశ్ విలేకరులతో మాట్లాడుతుండగా.. అతడి తల్లి ఫోన్ చేసింది. దీంతో ప్రెస్ మీట్ ఆపేసిన అతడు.. తల్లితో ఫోన్ మాట్లాడాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మీడియా సమావేశంలో రిపోర్టర్ల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్న సమయంలో నితీశ్ కుమార్ రెడ్డి ఫోన్ మోగింది. అమ్మ నుంచి కాల్ వచ్చిందని గుర్తించిన అతడు.. ప్రెస్ మీట్‌ను కాసేపు ఆపి ఫోన్ లిఫ్ట్ చేశాడు. ఈ విషయాన్ని విలేకరులకు చెప్పాడు. 'అమ్మా.. 5 నిమిషాల్లో మళ్లీ చేస్తాను' అని తెలుగులో మాట్లాడి ఫోన్ కట్ చేశాడు. అనంతరం మీడియా ప్రతినిధులకు చిరునవ్వుతో సారీ చెప్పాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియో చూసిన నెటిజన్లు.. నితీశ్ కుమార్ రెడ్డిపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. . 'మన తెలుగును ప్రపంచ వేదికపై హైలైట్ చేస్తున్నాడు', 'నితీశ్‌కు అమ్మ అంటే ఎంత ప్రేమో..' , 'అమ్మ నుంచి కాల్ వస్తే ఎత్తక తప్పదు మరీ' అని అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. ఇక మ్యాచ్ విషయానికొస్తే.. అఫ్ఘానిస్థాన్‌తో ధర్మశాల వేదికగా జరిగిన తొలి వన్డేను వర్షం కారణంగా.. 25 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్ఘానిస్థాన్ జట్టు 194 పరుగులకు ఆలౌటైంది. అరంగేట్రంలోనే గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబె తలో 3 వికెట్లతో సత్తాచాటారు. నితీశ్ కుమార్ రెడ్డి, అర్షదీప్ సింగ్ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం టీమిండియా 22.5 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. శుభ్‌మన్ గిల్(84లి), కేఎల్ రాహుల్(39లి) రాణించారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

# ఒకే రోజున భారత జట్లు మూడు కీలక మ్యాచ్‌లు!



క్రికెట్ అభిమానులకు జూన్ 17 ప్రత్యేకమైన రోజుగా మారనుంది. ఒకే రోజున భారత సీనియర్ జట్టు, ఇండియా-ఎ జట్టు, భారత మహిళల జట్టు కీలక మ్యాచ్‌లు ఆడనున్నాయి. తిలక్ వర్మ నేతృత్వంలోని ఇండియా-ఎ జట్టు, శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని సీనియర్ జట్టు, మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు వరుసగా బరిలోకి దిగనున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు క్రికెట్ అభిమానులకు పండుగ వాతావరణం నెలకొననుంది.భారత క్రికెట్ అభిమానులకు జూన్ 17 ప్రత్యేకమైన రోజుగా నిలవబోతోంది. సాధారణంగా ఒకే రోజున ఒక భారత జట్టు మ్యాచ్ ఆడటం చూస్తుంటాం. కానీ ఈసారి సీనియర్ పురుషుల జట్టు, ఇండియా-ఎ జట్టు, మహిళల జట్టు వరుసగా బరిలోకి దిగనున్నాయి. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు దాదాపు 12 గంటలకు పైగా భారత క్రికెట్ అభిమానులు టీవీలు, మొబైల్ స్క్రీన్‌లకు అతుక్కుపోయే అవకాశం కనిపిస్తోంది. ఈ ప్రత్యేక రోజున మూడు వేర్వేరు స్థాయిల్లో భారత జట్లు కీలక పోరాటాలకు సిద్ధమవుతున్నాయి. యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించే ఇండియా-ఎ జట్టు మ్యాచ్‌తో రోజు ప్రారంభమవుతుంది. అనంతరం సీనియర్ జట్టు వన్డే సిరీస్‌లో కీలక మ్యాచ్ ఆడనుండగా, రాత్రికి మహిళల జట్టు టీ20 ప్రపంచకప్ పోరులో పాల్గొంటుంది. ఉదయం 10 గంటలకు ఇండియా-ఎ జట్టు అఫ్గానిస్థాన్-ఎతో తలపడనుంది. ప్రస్తుతం జరుగుతున్న త్రైపాక్షిక టోర్నీలో ఈ మ్యాచ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. యువ ఆటగాళ్లతో కూడిన భారత జట్టుకు నాయకత్వం వహిస్తున్న తిలక్ వర్మకు ఇది మరో పరీక్షగా మారనుంది. ఫైనల్ అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలంటే ఈ మ్యాచ్‌లో మంచి ప్రదర్శన అవసరం కావొచ్చని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. యువ ప్రతిభను అంచనా వేయాలనుకునే అభిమానుల దృష్టి ఈ మ్యాచ్‌పై ఉండనుంది. ఆ తర్వాత మధ్యాహ్నం 1.30 గంటలకు భారత సీనియర్ జట్టు అఫ్గానిస్థాన్‌తో వన్డే మ్యాచ్ ఆడనుంది. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని జట్టు ఇప్పటికే సిరీస్‌లో ఆధిక్యం సాధించిన నేపథ్యంలో ఈ మ్యాచ్ విజయం ద్వారా సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇటీవల యువ ఆటగాళ్లు, కొత్త కాంబినేషన్లతో ప్రయోగాలు చేస్తున్న భారత జట్టు మరోసారి తన బలాన్ని చాటుకునేందుకు సిద్ధమవుతోంది. ఇక రాత్రి 7 గంటలకు మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు బరిలోకి దిగనుంది. నెదర్లాండ్స్‌తో జరిగే ఈ మ్యాచ్‌లో విజయం సాధించి టోర్నీలో తమ జోరును కొనసాగించాలని భారత మహిళలు భావిస్తున్నారు. గత మ్యాచ్‌లో సాధించిన విజయంతో ఉత్సాహంగా ఉన్న జట్టు, తదుపరి కీలక పోరాటాలకు ముందు ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుకోవాలని చూస్తోంది.

# పాక్ బౌలర్ గొంతు పట్టుకున్న టీమిండియా ప్లేయర్.!!



హై-వోల్టేజ్ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం 171 పరుగుల క్లిష్టమైన లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్ జట్టు భారత బౌలర్ల ధాటికి తట్టుకోలేకపోయింది. వరుస వికెట్లు కోల్పోతూ కేవలం 106 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో భారత మహిళల జట్టు పాకిస్థాన్‌పై ఘన విజయాన్ని నమోదు చేసి టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. అయితే ప్రస్తుతం ఈ మ్యాచ్‌కు సంబంధించిన వీడియో అంటూ ఒకటి వైరల్ అవుతుంది. మ్యాచ్ మధ్యలో పాకిస్తాన్ బౌలర్.. భారత బ్యాటర్ మీదకు దూసుకెళ్లడం.. అదే సమయంలో భారత ప్లేయర్ పాక్ ప్లేయర్ గొంతు పట్టుకోవడం చకచకా జరిగిపోతాయి. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియా అయిన ఎక్స్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతుంది. అయితే ఇది నిజమైన వీడియో కాదు. ఏఐతో సృష్టించిన వీడియో. భారత్, పాకిస్తాన్ మహిళల జట్ల మధ్య జరిగిన పోరులో ఇటువంటి సంఘటన అస్సలు చోటుచేసుకోలేదు. ఈ వీడియోను క్షణ్ణంగా పరిశీలిస్తే మీకు కూడా అర్థం అవుతుంది. మొదట మైదానంలో ఇద్దరు భారత బ్యాటర్లే కనిపిస్తారు. అనంతరం ముగ్గురు బ్యాటర్లు కనిపిస్తారు. ప్రస్తుతం బై రన్నర్ నిబంధన లేదు. మ్యాచ్ జరుగుతున్న సమయంలో బ్యాటింగ్‌కు చెందిన జట్టు నుంచి కేవలం ఇద్దరు బ్యాటర్లు మాత్రమే మైదానంలో ఉంటారు.

# వైభవ్ సూర్యవంశీ వెనుక ఆరేళ్ల కఠిన శ్రమ



ఐపీఎల్ లాస్ట్ రెండు సీజన్లలో తన అద్భుతమైన బ్యాటింగ్‌తో అందరినీ ఆశ్చర్యపరిచిన యంగ్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ సక్సెస్ వెనుక ఆరేళ్ల కఠిన శ్రమ దాగి ఉంది. కేవలం 15 ఏళ్ల వయసులోనే వరల్డ్ క్రికెట్ మోస్ట్ ఎక్సైటింగ్ బ్యాటింగ్ సెన్సేషన్‌గా మారిన వైభవ్, రీసెంట్ ఐపీఎల్ సీజన్లలో 237 ప్లస్ స్ట్రైక్ రేట్‌తో 776 రన్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ సూపర్ పర్ఫార్మెన్స్‌తో యూకే టూర్‌కు వెళ్లే ఇండియా టి20ఐ టీమ్‌కు సెలెక్ట్ అయ్యాడు. పాట్నాలోని తన అకాడమీలో ఎనిమిదేళ్ల వయసు నుంచి వైభవ్‌కు ట్రైనింగ్ ఇచ్చిన చైల్డ్‌హుడ్ కోచ్ మనీష్ ఓఝా అతని జర్నీ గురించి ఇంట్రెస్టింగ్ విషయాలు షేర్ చేశాడు. టెన్నిస్ బాల్ నుంచి హార్డ్‌బాల్ క్రికెట్‌కు మారినప్పటి నుంచి వైభవ్ రోజుకు కనీసం 600 బంతులు అంటే దాదాపు 100 ఓవర్లు ఫేస్ చేసేవాడని కోచ్ ఓఝా చెప్పాడు. ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నాన్‌స్టాప్‌గా ప్రాక్టీస్ సాగేది. ఫస్ట్ తానే స్వయంగా 200 నుంచి 300 బంతులు త్రోడౌన్స్ వేసేవాడినని, తాను అలసిపోతే సపోర్ట్ స్టాఫ్, వారు కూడా అలసిపోతే అకాడమీ బౌలర్లు వైభవ్‌కు బౌలింగ్ చేసేవారని తెలిపాడు. అందరూ అలసిపోయినా నెట్ సెషన్స్, బౌలింగ్ మెషిన్ల ద్వారా వైభవ్ తన బ్యాటింగ్ ప్రాక్టీస్ కంటిన్యూ చేసేవాడు. ఈ ఆరేళ్ల రిపీటెడ్ ట్రైనింగ్ వల్లే అతనిలో అద్భుతమైన మజిల్ మెమరీ, పవర్‌ఫుల్ బ్యాట్ స్వింగ్ క్రియేట్ అయ్యాయని విశ్లేషించాడు. సమస్తీపూర్ నుంచి రెండున్నర గంటల పాటు ట్రావెల్ చేసి వైభవ్ తన తండ్రి సంజీవ్‌తో కలిసి ఉదయం 5 గంటలకే పాట్నా అకాడమీకి వచ్చేవాడు. వైభవ్ కెరీర్ కోసం అతని పేరెంట్స్ ఎన్నో త్యాగాలు చేశారని కోచ్ గుర్తుచేసుకున్నాడు. వైభవ్ తల్లి ఆర్తి రోజు అర్ధరాత్రి 2 గంటలకే లేచి లంచ్ ప్రిపేర్ చేసేది. కేవలం వైభవ్, అతని తండ్రి కోసమే కాకుండా వారితో పాటు వచ్చే బౌలర్లు, అకాడమీలో పేద పిల్లల కోసం రోజు 10 నుంచి 15 మందికి సరిపోయే ఫుడ్ ప్యాక్ చేసి పంపేదని ఎమోషనల్ అయ్యాడు. పేరెంట్స్ ఫుల్ సపోర్ట్ వల్లే వైభవ్ ఈరోజు ఛాంపియన్ ప్లేయర్ అయ్యాడని స్పష్టం చేశాడు. వైభవ్ సూర్యవంశీ సక్సెస్ గ్రాఫ్ చూసిన తర్వాత ఇప్పుడు ఇండియా అంతటా పేరెంట్స్ తమ పిల్లలను క్రికెటర్లు చేయాలని డిసైడ్ అవుతున్నారు. ప్రస్తుతం ఐదేళ్ల చిన్న పిల్లలను కూడా అకాడమీకి తీసుకొస్తూ తమ బిడ్డను 'నెక్స్ట్ వైభవ్' లా మార్చాలని కోరుతున్నట్లు ఓఝా చెప్పాడు. వైభవ్ ఇప్పుడు ఇండియాలోని యంగ్ జనరేషన్‌కు ఒక రోల్ మోడల్, ఒక బిగ్ ఇన్‌స్పిరేషన్‌గా మారాడని సంతోషం వ్యక్తం చేశాడు. సరైన టెక్నికల్ పారామీటర్స్, కఠినమైన క్రమశిక్షణతో ఆడితే పాజిటివ్ రిజల్ట్స్ వస్తాయని వైభవ్ ప్రూవ్ చేశాడని కొనియాడాడు.

# మైదానంలో చూసే కోహ్లీ.. బయట ఉండే కోహ్లీ

## - మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి ఇంట్రెస్టింగ్ కామెంట్స్



ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మీద ఉన్న ఒక బిగ్గెస్ట్ మిత్ (అపోహ) గురించి మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. కోహ్లీతో కలిసి చాలా ఏళ్లు ట్రావెల్ చేసిన శాస్త్రి, విరాట్ క్యారెక్టర్ గురించి ఓపెన్ అయ్యాడు. కోహ్లీ అహంకారి, గర్వంతో ఊగిపోతాడు, ఒక మొండి పిల్లాడిలా బిహేవ్ చేస్తాడు అని అందరూ అనుకుంటారు. శాస్త్రి మాటల ప్రకారం ఇదంతా నిజమే కావచ్చు కానీ, అది కేవలం క్రికెట్ గ్రౌండ్ వరకు మాత్రమే పరిమితం. ఫీల్డ్ బయట కోహ్లీ కంప్లీట్ డిఫరెంట్ పర్సన్ అని శాస్త్రి చెప్పాడు. మ్యాచ్ స్టార్ట్ అవ్వగానే అగ్రెసివ్ మోడ్‌లోకి వెళ్లి, బయటకు రాగానే నార్మల్‌గా మారిపోయే ఆ స్విచ్ ఆన్, స్విచ్ ఆఫ్ క్వాలిటీ కోహ్లీలో తనకు చాలా ఇష్టమని వివరించాడు. న్యూజిలాండ్ బ్యాటింగ్ లెజెండ్ కేన్ విలియమ్సన్ ఇంటర్నేషనల్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించడంతో విరాట్ కోహ్లీ ఎమోషనల్ అయ్యాడు. వీరిద్దరి స్నేహం 2008 అండర్-19 వరల్డ్ కప్ నుంచి కొనసాగుతోంది. 16 ఏళ్ల కెరీర్‌లో కివీస్ టీమ్ తరఫున 378 మ్యాచ్‌లు ఆడి ఎన్నో రికార్డులు క్రియేట్ చేసిన విలియమ్సన్‌ను క్రికెట్ వరల్డ్ మొత్తం గౌరవిస్తుంది. 2025లో టి20 ఇంటర్నేషనల్స్ నుంచి కూడా తప్పుకోవాలని కేన్ తీసుకున్న డెసిషన్ తర్వాత కోహ్లీ సోషల్ మీడియాలో స్పెషల్ మెసేజ్ పోస్ట్ చేశాడు. మైదానంలో ప్రత్యర్థిగా ఉన్నా, బయట మాత్రం తమ మధ్య ఉన్న ఫ్రెండ్‌షిప్ చాలా విలువైందని కోహ్లీ రాసుకొచ్చాడు. ఐపీఎల్‌లో కూడా కోహ్లీ, విలియమ్సన్ చాలా సార్లు పోటీ పడ్డారు. విలియమ్సన్ సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్ టీమ్స్ కు ప్రాతినిధ్యం వహించగా, కోహ్లీ ఆర్సీబీ మెయిన్ ప్లేయర్‌గా ఉన్నాడు. "నీ బ్యాటింగ్ చూడటం, నీతో పోటీ పడటం నాకు ఎప్పుడూ ఒక ప్లెజర్. అంతకంటే ఎక్కువగా నీ స్నేహాన్ని, క్రికెట్ పై నీకు ఉన్న విజన్‌ను నేను గౌరవిస్తాను" అని కోహ్లీ చెప్పాడు. ఇప్పటి వరకు కేన్ క్రికెట్ కోసం తన వంతు కృషి చేశాడని, ఇకపై విశ్రాంతి తీసుకుంటూ లైఫ్ ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. జీవితం ఇప్పుడే మొదలైందని, అతనికి ఎప్పుడూ ఆల్ ది బెస్ట్ అని తన మిత్రుడికి ఫేర్వెల్ ఇచ్చాడు. రవిశాస్త్రి, కోహ్లీ కాంబినేషన్‌లో ఇండియా టీమ్ ఇంటర్నేషనల్ లెవెల్లో ఎన్నో విజయాలు సాధించింది. కోహ్లీ గ్రౌండ్ లో చూపే ఆ అగ్రెషన్ వెనుక టీమ్ గెలవాలనే తపన ఉంటుందని శాస్త్రి క్లారిటీ ఇచ్చాడు. ముఖ్యంగా స్లో పిచ్ ల మీద కూడా కోహ్లీ తన టెక్నిక్‌తో రన్స్ చేయగలడని కొనియాడాడు. క్రికెట్ క్లోజ్ టు హార్ట్ అని భావించే కోహ్లీ, ఆటను ఎప్పుడూ వదిలిపెట్టాలని అనుకోడని తెలిపాడు. ఇప్పుడు విలియమ్సన్ లాంటి మిత్రుడు తప్పుకోవడంతో కోహ్లీ కాస్త ఫీల్ అయినప్పటికీ, అతని గ్లోరియస్ కెరీర్ పట్ల సంతోషంగా ఉన్నట్లు స్పష్టం చేశాడు.

# ఏబీ డివిలియర్స్ రికార్డ్‌ను బద్దలకొట్టిన చాహల్



టీమిండియా లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చహల్ బంతితోనే కాకుండా బ్యాట్‌తో కూడా అద్భుతాలు చేయగలనని నిరూపించాడు. ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ విసిరిన వినూత్న బ్యాటింగ్ ఛాలెంజ్‌ను స్వీకరించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. సాధారణంగా తన స్పిన్ మాయాజాలంతో ప్రత్యర్థులను కట్టడి చేసే చహల్.. ఈసారి బ్యాట్‌తో బంతిని బౌండరీ బయటకు పంపించాడు. కేవలం 50 బంతుల్లోనే 100 పరుగులు చేయాలని, బౌలింగ్ గంటకు 81 కిలోమీటర్ల వేగంతో మొదలై.. ప్రతీ బంతికి ఒక మైలు చొప్పున పెరుగుతుందని పీటర్సన్ సవాల్ విసిరాడు. అంతేకాకుంబా బౌండరీ దూరాన్ని 40 మీటర్లకు తగ్గించాడు. ఈ వినూత్న నిబంధనలతో సాగిన ఈ పోరు ఆద్యంతం ఉత్కంఠ రేకెత్తించింది.తొలి బంతికే సిక్సర్ బాదిన చాహల్.. రెండో బంతిని కూడా సిక్సర్ తరలించాడు. అయితే మూడో బంతికి క్యాచ్ ఇవ్వగా ఫీల్డర్ వదిలేసాడు. ఈ అవకాశంతో చాహల్ చెలరేగాడు. అతని షాట్లకు పీటర్సన్ అవాక్కయ్యాడు. 8వ బంతికి చాహల్ ఔటైనప్పటికీ.. రూల్స్ ప్రకారం ఔటైనప్పుడు తిరిగి బ్యాటింగ్ చేసేందుకు అతని స్కోర్ నుంచి ఐదు పరుగులు తగ్గించారు. దాంతో చాహల్ స్కోర్ 26 పరుగులకు పడిపోయింది. 10 బంతులు ముగిసే సరికి చాహల్ 33 పరుగులు చేశాడు. ఆ తర్వాత దూకుడుగా ఆడిన చాహల్ 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ హాఫ్ సెంచరీని చాహల్ తనదైన శైలిలో సెలెబ్రేట్ చేసుకున్నాడు. పీటర్సన్ సైతం అతన్ని కౌగిలించుకొని అభినందించాడు. ఆ తర్వాత 16వ బంతికి మరో సిక్సర్ కొట్టే ప్రయత్నంలో చహల్ అవుటయ్యారు. దీనితో మరొక ఐదు పరుగులు కోల్పోవాల్సి వచ్చింది. 20వ బంతి ముగిసే సమయానికి చహల్ స్కోరు 56 పరుగుల వద్ద ఉంది. ఆ తర్వాత వరుస సిక్సర్లతో విరుచుకుపడి కేవలం 25 బంతుల్లోనే 90 పరుగుల మార్కును అందుకున్నాడు. చివరకు 29వ బంతిని ఆకాశమే హద్దుగా సిక్సర్ బాదిన చహల్ శతకం పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో సౌతాఫ్రికా విధ్వంసకర బ్యాటర్ ఏబీ డివిలియర్స్ పేరిట ఉన్న పాత రికార్డును చహల్ అధిగమించాడు. ఈ సవాలును పూర్తి చేయడానికి చహల్ ఏకంగా 17 సిక్సర్లు కొట్టాడు. ఇంకా 21 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించి చరిత్ర సృష్టించాడు.

# వెంకటేశ్, కళ్యాణ్ రామ్ కాంబో

## మరో సినిమా ప్లాన్ చేస్తున్న అనిల్ రావిపూడి




టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి మరో భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ముఖ్యంగా సంక్రాంతి సీజన్‌లో ఆయన సినిమాలకు ప్రత్యేక క్రేజ్ ఏర్పడింది. 'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకర వరప్రసాద్ గారు' వంటి వరుస విజయాల తర్వాత అనిల్ రావిపూడి ఇప్పుడు విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్‌లతో కలిసి ఓ క్రేజీ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే వెంకటేష్‌తో 'ఎఫ్2', 'ఎఫ్3' వంటి విజయవంతమైన చిత్రాలు అందించిన అనిల్, కళ్యాణ్ రామ్‌తో తన తొలి చిత్రం 'పటాస్' ద్వారా సూపర్ హిట్ అందుకున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరు హీరోలను ఒకే సినిమాలో చూపించబోతుండటంతో ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రీ-ప్రొడక్షన్ పనులు కూడా దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయని సమాచారం. పూర్తి స్థాయి యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సినిమా టైటిల్‌కు సంబంధించి ఆసక్తికరమైన ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పండుగ వాతావరణం, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్, అనిల్ రావిపూడి స్టైల్ కామెడీకి సరిపోయేలా ఈ చిత్రానికి 'సంక్రాంతి సరుకు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ టైటిల్ మాస్, ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే, ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'సింగ్ గీతం' గోల్డెన్ బ్లాక్‌బస్టర్ ఈవెంట్‌లో అనిల్ రావిపూడి చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్‌గా మారాయి. ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన ఈ చిత్ర విజయోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, నిర్మాత నాగ్ అశ్విన్‌పై ప్రశంసలు కురిపించారు. సాధారణంగా మేము ట్రైలర్లు, ప్రమోషన్లతో సినిమాపై హైప్ క్రియేట్ చేయడానికి చాలా కష్టపడతాం. కానీ నాగ్ అశ్విన్ మాత్రం ట్రైలర్ లేకుండానే సినిమాను విడుదల చేసి విజయం సాధించారు. ఆ ఫార్ములా నాకు బాగా నచ్చింది. ఇకపై నా సినిమాలకు కూడా ట్రైలర్లు కట్ చేయను అంటూ సరదాగా వ్యాఖ్యానించారు.

# కరుప్ప విజయంతో మరింత బిజీగా త్రిష


## రెమ్యునరేషన్ కూడా పెంచినట్లు టాక్



సౌత్ సినీ ఇండస్ట్రీలో రెండు దశాబ్దాలకు పైగా తన స్టార్‌డమ్‌ను నిలబెట్టుకున్న హీరోయిన్ త్రిష మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం ఆమె రెమ్యూనరేషన్‌కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వరుస విజయాలతో కెరీర్‌లో మళ్లీ బిజీ అయిన త్రిష, కొత్త సినిమాల కోసం తన పారితోషికాన్ని పెంచినట్లు సినీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. త్రిష కెరీర్‌ను పరిశీలిస్తే ఎన్నో విజయాలతో పాటు కొన్ని పరాజయాలు కూడా ఎదురయ్యాయి. అయితే ప్రతిసారి చిన్న విరామం తర్వాత ఆమె మరింత బలంగా తిరిగి వచ్చి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇదే కారణంగా ఆమెను సౌత్ ఇండస్ట్రీలో అత్యంత నిలకడైన హీరోయిన్లలో ఒకరిగా భావిస్తారు. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాలు సాధించకపోయినా, తాజాగా కరుప్పు వంటి భారీ హిట్‌తో త్రిష మార్కెట్ మళ్లీ ఊపందుకుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఆమె కెరీర్‌లో మరో గోల్డెన్ ఫేజ్ నడుస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పెద్ద హీరోల సరసన అవకాశాలు రావడం, పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పెరగడం, ప్రేక్షకుల్లో ఇప్పటికీ మంచి ఆదరణ ఉండటం ఆమె క్రేజ్‌కు ప్రధాన కారణాలుగా చెప్పొచ్చు. యువ హీరోయిన్ల నుంచి గట్టి పోటీ ఉన్నప్పటికీ, తన అనుభవం, నటన, స్క్రీన్ ప్రెజెన్స్‌తో త్రిష ప్రత్యేక స్థానాన్ని కొనసాగిస్తున్నారు. అందుకే నిర్మాతలు ఇప్పటికీ ఆమెను తమ ప్రాజెక్టుల్లో భాగం చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని సమాచారం. ఇటీవల విడుదలైన కరుప్పు చిత్రం విజయంతో త్రిషకు కొత్త అవకాశాలు మరింత పెరిగినట్లు టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి రూపొందే ద్విభాషా చిత్రాల కోసం ఆమెను సంప్రదిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే త్రిష తన రెమ్యూనరేషన్‌ను కూడా పెంచినట్లు వార్తలు వెలువడు తున్నాయి. మరోవైపు త్రిష చేతిలో ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు ఉన్నాయి. తెలుగు, తమిళంతో పాటు ఇతర దక్షిణాది భాషల నుంచి కూడా అవకాశాలు వస్తున్నాయి.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న విజయ్-రష్మిక..

## విద్యార్థులకు అండగా కొత్త దంపతులు



స్టార్ దంపతులు విజయ్ దేవరకొండ, రష్మిక మందణ్ణ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. తాము ప్రకటించినట్టుగానే సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విజయ్ తండ్రి జన్మించిన తెలంగాణలోని అచ్చంపేట మండలంలోని 9, 10వ తరగతి విద్యార్థులకు అండగా నిలుస్తున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని విజయ్ దేవరకొండ స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.

ఈ మేరకు విజయ్ తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. "మా నాన్న పుట్టిన చిన్న పల్లె తుమ్మనపేటకు బయలుదేరాం. ఈ ఏడాది ఫిబ్రవరిలో నేను, రష్మిక మా ఒక చిన్న కలను ప్రకటించాం. అచ్చంపేట మండలంలోని 9, 10 తరగతుల విద్యార్థులను ప్రోత్సహించాలన్నదే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. విజయ్ పోస్ట్‌ను రష్మిక రీషేర్ చేస్తూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉదయ్‌పూర్‌లో వివాహ బంధంతో ఒక్కటైన ఈ జంట, 'దేవరకొండ ఫౌండేషన్' ద్వారా తుమ్మనపేటలోని 44 ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వ తరగతి చదివే విద్యార్థులకు విద్యా సహాయం అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఫీజులు చెల్లించడం, వారికి అవసరమైన నోట్‌బుక్స్, ఇతర స్టడీ మెటీరియల్‌ను అందించనున్నారు. తద్వారా తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించడంతో పాటు ఆర్థిక కారణాలతో చదువు మధ్యలో ఆగిపోకుండా చూడాలన్నది వీరి సంకల్పం.

ఇక సినిమాల విషయానికొస్తే, వివాహం తర్వాత విజయ్, రష్మిక తొలిసారిగా 'రణబాలి' అనే పీరియడ్ డ్రామా చిత్రంలో కలిసి నటిస్తున్నారు. గతంలో 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించిన ఈ జంటకు, 'రణబాలి' మూడో చిత్రం కానుంది. 1850ల నాటి చారిత్రక వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. చరిత్ర పుస్తకాల్లో నమోదుకాని, బ్రిటిష్ వారు తప్పుగా ప్రచారం చేసిన కొన్ని కీలక సంఘటనల ఆధారంగా ఈ చిత్రం కథ సాగుతుందని సమాచారం.

# కర్నూలులో నాగబంధం యూనిట్ సందడి




కర్నూలు నగరంలో నాగబంధం చిత్ర బృందం సందడి చేసింది. కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద అనంత పద్మనాభ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి ఈ సినిమా ప్రమోషన్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హీరో విరాట్ కర్ణ, హీరోయిన్ నభా నటేష్, కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు పాల్గొన్నారు. సినిమా ప్రమోషన్‌ను కర్నూలు నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందని సినీనటులు తెలిపారు. యువతకు పురాణ కథలు, దేవాలయాల గురించి సినిమాలో చూపించామన్నారు. జులై 3వ తేదీన ఈ చిత్రం విడుదలవుతుందని, అందరూ ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా కొండారెడ్డి బురుజు వద్ద హీరోయిన్ డ్యాన్స్‌తో సందడి చేశారు.

# సల్మాన్‌తో రాజ్ నిడుమోరు చిత్రం



'ది ఫ్యామిలీ మ్యాన్', 'ఫర్జీ' వంటి సూపర్ హిట్ సిరీస్‌లకు దర్శకత్వం వహించిన రాజ్ నిడిమోరు ఇప్పుడు బాలీవుడ్‌లో భారీ సినిమాకు సిద్ధమవుతున్నారు. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో రాజ్ ఆసక్తికర విషయాలు వెల్లడించారు. 'ఒక హాలీవుడ్ సినిమా స్క్రిప్ట్ ఇప్పుడే మొదలైంది, అది ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉంది. మరో సిరీస్ కూడా అభివృద్ధి దశలో ఉంది. మా హిందీ సినిమా నిర్మాణం త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను దృష్టిలోపెట్టుకొని, భారీ బడ్జెట్‌తో ఈ సూపర్ సినిమా రూపొందిస్తున్నారు. అక్టోబర్‌లో ఈ షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తారని సమాచారం. అయితే ఈ విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. గతంలోనూ ఈ సినిమా గురించి వార్తలు ప్రచారమయ్యాయి. ఈ చిత్రంలో రాజ్ భార్య సమంత హీరోయిన్‌గా నటించే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. అయితే, వాటిని రాజ్ సన్నిహిత వర్గాలు కొట్టిపారేశాయి. ఇక, సల్మాన్ ప్రస్తుతం దర్శకుడు వంశీ పైడిపల్లి, నిర్మాత దిల్‌రాజు కాంబినేషన్‌లో వస్తున్న మూవీలో షూటింగ్‌లో బిజీగా ఉన్నారు.

# ప్రాణం పోతున్నట్టు ఉంది..

## ఎమోషనల్ పోస్ట్ పంచుకున్న మృణాల్!



సినీ సెలబ్రిటీలు నిత్యం షూటింగ్ లతో బిజీగా గడిపేస్తూ తల మునకలవుతున్న విషయం అందరికీ తెలిసిందే. అందుకే తమ సినిమాల షూటింగ్స్ నుండి కాస్త విరామం దొరికిందంటే చాలు తమకు ఇష్టమైన ప్రదేశానికి వెళ్ళిపోయి ఎంజాయ్ చేస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే ఒక హీరోయిన్ కొంతకాలం అక్కడే గడిపింది. తన మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంది. ఇప్పుడు ఆ సిటీ నుంచి వదిలి వస్తుంటే నా ప్రాణం పోతున్నట్టు ఉంది అంటూ ఎమోషనల్ అయ్యింది. ఆమె ఎవరో కాదు సీతామహాలక్ష్మి అలియాస్ మృణాల్ ఠాకూర్ఇటీవల వరుణ్ ధావన్ , పూజా హెగ్డే లతో కలిసి నటించిన హై జవానీతో ఇష్క్ హోనా హై అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది మృణాల్ ఠాకూర్ . ఇన్ని రోజులు ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా బిజీగా మారిన ఈమె.. కొన్ని రోజుల క్రితం చికాగోకి వెళ్ళింది. అక్కడ కూడా సందడి చేసింది. ఎంతో ఎంజాయ్ చేసింది. విదేశీ వీధిలో చిట్టి పొట్టి బట్టలతో గ్లామర్ లుక్కులో కనిపించి ప్రేక్షకులను, నెటిజన్లను ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు అక్కడినుంచి ఇండియాకి వస్తున్న నేపథ్యంలో అక్కడ ఎంజాయ్ చేసిన మధుర జ్ఞాపకాలను ఫోటోల రూపంలో బంధించి ఇంస్టాగ్రామ్ వేదికగా షేర్ చేసింది ఈ ముద్దుగుమ్మ.బ్యాగులు మొత్తం సర్దేశాను.. ఇక ఈ సిటీని వదిలే సమయం వచ్చింది. నిజం చెప్పాలంటే ప్రాణం పోతున్నట్టు ఉంది అంటూ ఏడుస్తున్న ఎమోజిని షేర్ చేసింది. ప్రస్తుతం ఇంస్టాగ్రామ్ వేదికగా వైరల్ అవుతున్న ఫోటోలు పంచుకున్న క్యాప్షన్ అందరినీ ఆకట్టుకుంటుంది. ఆ సిటీ మీకు అంత నచ్చిందా అంటూ అభిమానులు కూడా కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికి అయితే మృణాల్ షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఇక ఇందులో ఈమె గ్లామర్ లుక్ తో ప్రేక్షకులను కట్టిపడేసింది. గ్లామర్ లుక్కులో విదేశీ వీధుల్లో తిరుగుతూ తెగ సందడి చేసింది. తనకు నచ్చిన ఫుడ్ తీసుకుంది. ఏది ఏమైనా మనకు నచ్చిన ప్రదేశాన్ని వదిలి వెళ్లాల్సి వస్తే ఎంత బాధ ఉంటుందో ప్రస్తుతం మృణాల్ కూడా అంతే బాధ అనుభవిస్తుంది అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613